UNIVERSAL LIBRARY
OU_204460
UNIVERSAL LIBRARY

OUP -902—26-3-70--5,000

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T 81·6/P645 Accession No. T 3799

Author

Title సాంఘిక సంఘటనలు - మంగళ హారం.

This book should be returned on or before the date last marked below.

శ్రీ

# కృతిసమర్పణము

శ్రీమత్తిరుపతికవిసు
త్రామసుహృత్త్వాభిరామ! రసవత్కవితో
ద్దామా! వేంకటశాస్త్రీ!
స్వామీ! గురుదేవ! గొనుము సాష్టాంగనతుల్.

ఎన్నఁడు బెండుప ల్కఁడవ దెవ్వనినాల్కకు, నే యుదారభా
వోన్నతునిన్ రసార్ద్రహృదయున్ వరియించుట సాటిబోంట్లలో
మన్ననఁగాంచె నాంధ్రి, యతిమానుషమేని యుపజ్ఞ, యట్టి సం
పన్నకళాప్రపంచపరిపాలనధూర్వహుఁ గొల్చి శ్రీపతిన్

జగదాశ్చర్యకరావధానకవితాసంపత్తికిన్ మ్రొక్కి, మీ
యుగళస్నేహము ప్రస్తుతించి, భవదీయోదారభావప్రసా
దగుణోత్ఫుల్లకృతిప్రసూనవిగళన్మారందధారాసుధా
పగ నోలాడి, రచించి తెచ్చితిమి దేవా! నీకు నీదక్షిణన్.

వసుధాధీశులు కాన్కలంప, సుకవుల్ పద్యోపహారమ్ము లం
ప, సుధీశాలి శుభాభినందనము లంపన్, సంస్కృతాంధ్రాంగనల్
కుసుమోపాయన మంపఁగా నొదవె నీకున్ షష్టిపూర్త్యుత్సవా
వసరం; బీ చిఱుకబ్బ మప్పనము దేవా! నీకుఁ గైకోఁగదే!

కేతనతోడఁ బొత్తునకుఁ గేల్ కలపం దలపోసి కాదు, నీ
చేతము మెచ్చఁగాఁ గవితచెప్పఁగ నేర్తు మటంచుఁ గాదు, వి
ఖ్యాతికిఁ గా, దిఁకేమనిన, నద్యతనాంధ్రకవిప్రపంచని
ర్మాతకు భక్తిమై నుడుగరల్ ఘటియించెడి పూన్కియే సుమీ!

సంచితపూర్వపుణ్యము లొసంగు ఫలమ్ములవోలె వాసనల్
ముంచుకొనన్ నవప్రసవముల్ విరబూచుచునున్న దీవు క
ల్పించిన పాదులందుఁ బ్రభవించిన నూత్నకవిత్వవల్లి; యీ
కొంచెపుఁబూలమాలఁ గయికొమ్ము గళాభరణమ్ము నీకగున్.

భావవిశుద్ధి దోఁపఁగ భవత్పదముల్ భజియించునాఁటి మా
సేవలు మెచ్చి యాదరవిశేష మెలర్పఁగ సల్పినట్టి మీ
దీవన నిక్కమై యొసఁగెఁ దియ్యనికావ్యఫలమ్ము నేఁటికిన్;
నీ విడినట్టి భిక్ష యిది నీకె యొసంగెద మిప్డు విందుగాన్.

పుడమిఱేఁడులు తల లడుగులు మోవంగ
నర్పించుకాన్కల నందువాఁడు
అత్యద్భుతంబైన యవధానవిద్యకుఁ
బ్రభవకారణమైన ప్రతిభవాఁడు
పీనుఁగోయికిఁ దేనెసోనలు వర్షించు
వాఙ్మాధురికిఁ బేరువడినవాఁడు
చిననాఁడె వలచివచ్చిన కవితాకన్య
నేకపత్నిఁగఁ జేసి యేలువాఁడు

పూర్ణకాముండు త్యాగియు భోగియైన
గురునిబుణి మీఁగుడొంటు నీ చిఱుతకబ్బ
మర్హ్యతఁ గడించుకొనుఁగాక యాంధ్రవాణి
కడకనుల జాల్గొను ప్రసాదకణలవాప్తి.

ఇట్లు

గురుదక్షిణ.

# సౌందరనందము

## పునరాగమనము

యన్మహాత్మ్యాగమహిమమ్ము నాలకించి
మూఁడుకాలముల్ రోమాంచమును వహించు
నేడుదీవులకున్ బ్రాఁకి యెవని ధర్మ
లతలు ననలెత్తె నాశాక్యపతిసుతుండు

తనసత్తోడిదే లోకమని నమ్మి దరిఁద్రొక్కి
యున్నట్టి పితృదేవు నుజ్జగించి
యురమున వ్రాలి మైమఱచి నిద్దురచెందు
లలితాంగి స్నేహవల్లరిని ద్రెంచి
తనసేఁత కరమోడ్పుఁగనుల నవ్వుచుఁ గూర్కు
పట్టిపైఁ జను కూర్మి పట్టి తిగిచి
తనమూఁపుపైఁ గేలుఁదలిరు చాఁపఁగఁజూచు
పుడమిచేడియకు దోబూచిచేసి

సత్యమార్గగవేషణాసక్తుఁ డగుచు
నడవులం జొచ్చి తపముల నాచరించి
'నేతి నేతి' యటంచు ననేకగతుల
బడలి కనుఁగొనెఁ దుదకు నిర్వాణపథము.

పరమపదామృత మ్మటులు పారణసల్పిన యాత్మబోధముల్
విరిసి తమంతటన్ హృదయవీధుల వెల్లువలై తొలంకెనా
కరుణాసరోజసుందరతదక్షియుగమ్మున జాలువాఱె సం
సరణమహాబ్ధిమగ్నమగు మానవకోటిపయిన్ గృపాఝరుల్.

అమ్మహాత్ముఁ డంతట మహాద్భుతమైన వినూత్నధర్మచ
క్రమ్మును గేలఁ ద్రిప్పుచుఁ బురమ్ములు చేరఁగవచ్చెఁ బాలసం
ద్రమ్మున నుద్భవించిన సుధాకలశమ్మును దాల్చి నాకలో
కమ్మునవారిఁ బ్రోచుటకుఁగా దరిచేరిన వెజ్జుకైవడిన్.

వారణాసీముఖక్షేత్రవరములందుఁ
బండితసదస్సులంగూర్చి పరమనూత్న
ధర్మము నుపన్యసించె సదస్యులెల్లఁ
బదులుపలుక నెఱుంగక ప్రణుతిసేయ.

పల్లెలఁ బట్టణమ్ముల నవారిగ నీగతి ధర్మబీజముల్
చల్లుచునేగుచో, నడుగుసాగఁగనీయక 'మాకు మా' కటం
చెల్లరుఁ జుట్టువాఱుదురఁటే! తినుబండము చేతనుండఁగాఁ
దల్లిని జేరు పిల్లలవిధంబున, నాపలు కెంతతీపియో!

పండితుఁడైన బ్రాహ్మణుఁడుఁ బామరుఁడైన నిషాదుఁడున్, ధరా
ఖండలుఁడున్ దదీయశిబికావహుఁడున్, రణధూర్వహుండు, భీ
రుండును, వారు వీ రనుచు రోయక యెల్లరుఁ గూడివాడి కే
ల్దండలుపట్టి పోఁదగిన దారి ప్రజాళికిఁ జూపి చెప్పుచున్

నలుదెసలఁ బొంచిన వృకాళివలన భీతి
మాన్పి గొల్లఁడు గోఁటియుల మనుచురీతి
జననమరణరుజాభీతి జనులకెల్లఁ
బాపి సుగతుం డశోకమా పదముఁ జేర్చె.

తన మెట్టిన పల్లీప
త్తనములు తీర్థమ్ములగుచుఁ దనరఁగ భవతా
పనివారకబోధామృత
మును గురియుచుఁ గపిలవాస్తుపురమున్ దరిసెన్.

ఆలనాఁటి నడిరేయి నశ్వరాజము వెన్ను
చమరి వీడ్కొనినట్టి స్థలము దాఁటి
చెన్నఱి దాలఁ దోఁచిన రాజగృహలక్ష్మి
పుల్కపుల్కనఁ దన్నుఁ బోల్చికొనఁగ
నెలగోలుమూఁకల మెల్గుల సౌధవా
తాయనమ్ము లపావృతములుగాఁగ
దలుపులు తెఱచి పౌరులు కిమితిబ్రువా
ణులగుచు వెఱగంది నిలిచిచూడ

నాత్తపరతత్త్వబోధమా నాత్మతేజ
మానసేందుని బరివేషమై భజింపఁ
బురము చొత్తెంచి నిలిచిన బోధిసత్త్వుఁ
గనుకనిఁ గని పౌరులు గములుగూడి,

బోధిసత్త్వుఁ డనుచు మునికులమణి యంచు
భూపసుతుఁడు సంగముక్తుఁ డనుచు
శాక్యరత్న మనుచు శౌద్ధోదని యటంచు
నడుగడుగున విన్న యాజనమ్ము,

అతఁడఁటే, సుకృతాత్మయైన మాయాదేవి
కడుపారఁ గన్న బంగారుతండ్రి!
ఆలుబిడ్డలును రాజ్యముఁ దృణమ్ముగఁ గాన
కేగినట్టి విరక్తుఁ డీతఁ డఁటవె!
వీఁడెయానే, కన్నబిడ్డలవలె మమ్ము
రక్షించుననుకొన్న రాసుతుండు!
మనబోఁటి పాపులకును మోక్షము నొసంగ
నరుదెంచు పుణ్యాత్ముఁ డఁటవె యితఁడు!

ఎంతభాగ్యమొ, యెన్నాళ్ళకే లభించె
సౌమ్యగంభీరమైన యీ చక్కనయ్య
నెమ్మొగము గాంచు పుణ్యమ్ము, నిఖలజగము
లేలఁగలవాఁడు కాఁడగఁడే యితండు.

మున్ను గుఱ్ఱాలజంటలను బూన్చిన బంగరు తేరిపగ్గముల్
చెన్నఁడు తాల్పఁగా సరిగచేలలు దాలిచి తూర్పుఁగొండపై
నున్న సరోజబాంధవునియొప్పున నేగెడి రాచబిడ్డకా!
ప్రన్ననిమేనఁ గావియును, బాదచరత్వముఁ, గతిపాలయ్యెన్.

మునుపటినాళ్లఁ బౌరజనమ్మున్ గనినంతనె పేరుపేరునన్
నెనరును జిందు చూపులను నెయ్యపు మాటలఁ దేర్చు ఱేఁ'డహో'
యనఁడు, 'సుఖమ్మె'యంచడుగఁ డప్పటికిప్పుడు చూచియున్;మఱే
మనఁగల, దీపురమ్ము దెస నాదృతిమానెనొ, విస్మరించెనో?

అనుచుఁ జేరనరిగి యక్కజంపడువారు
బుద్ధదేవ! మమ్ముఁ బ్రోవుమనుచుఁ
జక్క రాల నిలిచి సాఁగిలపడువారు
దరియ నరిగి కుశల మరయువారు.

అయిన స్త్రీబాలవృద్ధప్రజాళికతన
వెల్లివిరిసిన నదివోలె విరిసెఁ బురము
రాచవారెల్ల గౌతము రాక వినుచుఁ
దీర్థమున కేగుపగిది నేతెంచి రపుడు.

తడియాఱని కన్గవయున్
బొడియాఱిన నోరు నాచుఁ బుత్రునికై చే
డ్పడియున్న వృద్ధభూపతి
తడఁబడుచున్ జేరవచ్చెఁ 'దనయా' యనుచున్.

కజ్జలహీనమై కాంతిబాసిన కనుం
గొనలందు బాష్పాంబుకణము లురుల
విగతసంస్కారమై వ్రేలు పెన్నెఱికురుల్
చెదరి వెన్నునఁ జిక్కు జీరువడఁగ
వసివాళ్ళువాడిన పసిఁడిమైతీవ సం
భ్రమయానవశతఁ గంపమువహింపఁ
గాలిన చెక్కిళ్ళ పయిపయిన్ జాలువా
ఱిన కంటినీరు చారికలుగట్ట

నంతిపురి వీడి వచ్చి శూన్యావలోక
నములఁ గాంతుని గనుచు, రూపము వహించు
శోకమన దాల నిల్చె యశోధరయును
కొడుకుకూఁకటి నొకకేలఁ బుడికికొనుచు.

మమతావిరహితమున్ సం
భ్రమదూరముఁ గరుణరసతరంగితమున్ శాం
తమహోదారమగు కటా
క్షమునన్ దజ్జనముఁ గనుచు గౌతముఁ డనియెన్.

సుతుఁడంచున్ బతియంచు బాంధవుఁడఁటంచున్ మోహావిభ్రాంతిసం
గతులై, దుస్తరశోకవార్ధిఁ బడి చీకాకైన యో జీవసం
తతులారా! కలిపాశబద్ధులగు నార్తప్రాణులారా! జను
ర్మృతిసంపీడితులార! సత్యపథమున్ మీరెల్ల పాలింపుఁడీ!

భావింపన్ క్షణభంగురమ్మయిన జీవవ్రాతమున్ నమ్మి, యే
లా విభ్రాంతమతిన్ భవాంధువునఁ ద్రెళ్ళన్ జూతురయ్యయ్యో! యీ
చావుంబుట్టువులేల? కామ్యమృగతృష్ణావారికై పర్వులే
లా? వేభంగులసృష్టి నిత్యపదవాచ్యం బున్న విన్పింపుఁడీ!

మొదలిసంసృతిబంధకారణముఁ దన్మోక్షమ్ము నూహింపలే
కెద హింసారతి నూని పాపమతులై యేలా చెడన్? ద్రొక్కఁగాఁ
గదరయ్యా! నవధర్మమార్గమును, వక్కాణింపుఁడీ సత్యభూ
తదయాశీలత్రిశబ్దయుక్తమగు మంత్రం బర్థి వేనోళులన్.

యమనియమమ్ము లాకులు, యథార్థము నాభి, సమాధి నేమియై
యమరిన ధర్మచక్రము దయామతిఁ దాలిచి త్రిప్పరయ్య! యా
యమునకు బొమ్మవెట్టియు, భవాసురు నౌదల మెట్టి, మోక్షకాం
త మెడను తాలిగట్టుటకుఁ దారసిలున్ శుభతంతుసంతతుల్.

భవమను నైంద్రజాలికునిపాణితలమ్మునఁ జిక్కి, నశ్వరం
బవు సుఖచంచలాద్యుతులకై వలపూని, సువర్ణశృంఖలల్
దవిలిచి యొండొకళ్ళకు సదా నటియింతురు కీలుబొమ్మలై;
తవిలి చరింపరాదె నవధర్మము జన్మవిముక్తికల్గెడున్.

చరియింపరే! పాపసంఘాతతిమిరప
లాయనమంత్ర మస్తేయపథము
పాలింపరే! యపవర్గదుర్గకవాట
పాటన మ్మిది సత్యవాఙ్నియమము
కైకొనరే! లోకకల్యాణకృద్ధర్మ
సారభూతం బహింసావ్రతమ్ము
అంగీకరింపరే! యలరువింటికి దురా
సదమైన యీ బ్రహ్మచర్యదీక్ష

తాల్పరే! శాంతిదాంతినిధానములకు
మహితసిద్ధాంజనమ్ము సమత్వబుద్ధి;
ఆమయజరాపమృత్యువు లంటనీని
శీలకవచమ్ము దీనిఁ గైసేసికొనరె!

ఇది సత్యం, బిది నిత్యం,
బిది భవలతికాలవిత్ర, మిది శితదంష్ట్రి
వదనయగు మిత్తయాదలఁ
బదార్పణము, భవ్యమోక్షపద మియ్యదియే.

అని చాలించిన, వింజ మూకిడినయట్లై శ్రోతృలోకమ్ము క
న్గొనలఁ హర్షజలమ్ము నిండఁ గనుఁగొంచుఁ, భక్తిరంగత్తరం
గనిమజ్జన్మ్రదితాంతరంగమగుచుఁ గైమోడ్పు సంధించి, బు
ద్ధునిపాదమ్ముల వ్రాలె, వృద్ధనరనాథుం డంత మున్నాడుచున్.

'చిరకాలం బనపత్యతాకలుషశుష్కీభూతుఁడై యున్న నా
దురితమ్ముఁ దొలఁగింపఁ బుట్టితని సంతోషించితిఁ దొల్లి, యో
కరుణాసాగర! కేవలమ్ము నపవర్గప్రాప్తిసంధాతయా
గురుఁడం చిప్డె డెఱింగికొంటి నినుఁ గన్గోఁగంటి మిన్నంటితిఁ.

దేవ! యీదీనునకు ధర్మదీక్ష యొసఁగు'
మనుచు నంజలిఁబట్టి యార్తాతముఁ దాల్పఁ,
దక్కు జన మంత నధికారతారతమ్య
ములకు ననురూపమైన దీక్షలు వహించె.

పతిపదాబ్జాతముల వ్రాలి, పాదధూళి
తనయునకు రక్షగా మోముఁదమ్మి నిలిపి,
'నీ కివే జోత' లనిపించె నిర్వికార
మానస యశోధర గుణప్రసూనలతిక.

శరణము బుద్ధదైవము, ప్రశస్తతరమ్ము తదీయధర్మమే
శరణము, సత్యవాఙ్నియమసారదయాపరతంత్రవృత్తియే
శరణము మా కటంచు, జనసంఘము లాడుచుఁ బాడుకొంచు మం
దిరముల కేగి ధర్మనిరతిఁ జరియింపఁ దొడంగె నొప్పుగన్.

పరమపతివ్రతల్ కపిలవాస్తుపురిన్ గృహిణీమతల్లు లా
డరమున వేళదప్పక సదా తనరాక ప్రతీక్షసల్పుచున్
సురుచిరభిక్షులన్ సలుపుచున్ భజియింప, వసించెఁ దత్పురీ
పరిసరవృక్షవాటి భగవంతుఁడు శిష్యగణమ్ము కొల్వఁగన్.

ఇది

ప్రథమసర్గము.

చెవిదాఁకన్ గొనయమ్ము తుంటవిలు నీచేఁబూని, యాలీఢపా
దవిలాసమ్ముగ నిల్చిపొల్చు సొబఁగున్ గందోయికి న్విందుగా
నవలోకింపుచుఁ, బూవుటమ్ము రతి నీ కందింప, డెందమ్ములన్
గవియ న్నాటెడి లక్ష్యశుద్ధికి నమస్కారంబు మీనధ్వజా!

# భిక్షాగమనము

కలఁడు మహితాత్ముఁడైన శాక్యర్షి కొక్క
సవతి తమ్ముండు, కాంతిని స్తంద్రుఁ డతఁడు
నందుఁడను కోడెప్రాయపుటందగాఁడు,
సార్థకాఖ్య సుందరి వాని యతివమిన్న.

కేళీమందిరమందుఁ బుష్పలతికాక్రీడానికుంజమ్ములన్
బాలాస్నిగ్ధకపోలదర్పణరుచిన్ భావింపుచున్ జుంబన
వ్యాలోలుండగు నందసుందరు స్మరధ్యానమ్మునన్ బుద్ధ ధ
ర్మాలాపమ్ములు వీనుదోయిఁబడునో యాత్మన్ బ్రవేశించునో!

పంతము గర్వరేఖయును భాసిలుమానిని, మానసంపదన్
గాంతి దలిర్చుభామిని, వికాససుహాసిని, నాత్మసుందరిన్
సంతతసేవలం దనుపు నందునకున్ సుగతప్రచార మొ
క్కింత యెఱుంగనైన, రుచియించునె వానికి ముక్తిమార్గముల్?

పాతరలాడు తద్భ్రుకుటివల్లి యెటుల్ చలియించు నట్టులన్
జేతము తాండవింప మఱచెన్ నృపసూనుఁడు విశ్వమెల్ల, వే
లాతిగమా తదీయరుచిరాంగవిలాససుధాంబురాశిపీ
చీతతిఁ దొప్పదోఁగి నిలిచెన్ జెలిచూపుల పాపపోలికన్.

నడవుల రాజహంస, తెలినవ్వుల వెన్నెలవాఁక, ప్రేమలూ
రెడు నునుఁబల్కుఁదేనెపెర, రెమ్మలువైచు విలాసవల్లి, ప్రే
ల్మిడి హృదయమ్ము నుచ్చిచను మేలిమిచూపు సుమాస్త్రమైన యా
పడఁతుక నందభాస్కరుని బాయఁగనోర్వదు ఛాయయుంబలెన్.

పలుకుల్ సేఁతలు నెమ్మనమ్ము లొకటై, భావింపఁగారాని కూ
ర్ములపేర్ముల్, వలకాఁకలన్ గసరుటల్, రోషారుణాక్షమ్ముగాఁ
దిలకింపన్ బతిమాలుటల్, పులక లుద్దీపింపఁగాఁజేయు ము
ద్దులు, గిల్గింతలు కౌఁగిలింతలును బ్రొద్దుల్ పుచ్చు నాజంటకున్.

తానా సుందరనందుఁ, డవ్వేలఁదియా తన్వంగలావణ్య లీ
లానందైకనిధాన, మొండొరుల ప్రేమాలాపకేళీవినో
దానూనానుభవమ్ములా మదనవిద్యాదైశికమ్ముల్, సముల్
కానన్ రారు గదోయి, కామిజనలోకమ్మందు నాదోయికిన్.

చివురాకుబాఁకు దాల్చిన వజీరునకుఁ ద
    త్ప్రిమదకు లక్ష్యభూతమ్ములనాఁగ
నత్యంతమోదమ్ము నిత్యమాంగళ్యమ్ముఁ
    దలదాఁచుకొన్నట్టి నెల వనంగ
నుపమింపఁగారాని యుత్సాహవిజయముల్
    తోడునీడై కూడియాడె ననఁగఁ
గని విని యెఱుఁగని గగనపుష్పము నూత్న
    సౌరభ మ్మొక్కటఁ గూరె నాఁగఁ

గౌతుకము మొలపించు నొకళ్ళొకళ్ళ
హాసవీక్షణకిలికించితాదులెల్ల
మధుర మధురముల్ గాఁగ నామిథున మెప్పు
నాసలీవలు ననుచు ప్రాయంపువేళ.

సడలని కౌఁగిలింతలకుఁ జందనచర్చలు పేటులెత్తఁగా
నెడపడనట్టి చూపులకు నిర్వ్యర మైజిగి విందుసల్పఁగా
నుడుగకపల్కు చాటుమధురోక్తుల నాత్మలు హత్త, సీమమీ
ఱెడు ప్రణయాంబురాశి విహరించును దన్మిథునమ్ము వింతగన్.

మానవలోకనాయకకుమారవతంస మతండు నందనో
ద్యానవిహారి దైవతలతాంగియొ నాఁజను గాంతఁ గూడి, యా
మానవకోటిఁ జేరక యమర్త్యులఁ గూడక యొప్పె భూతసం
తానవవీనసృష్టిపరిణామ మిటుల్ నెఱవేఱెనో యనన్.

మేలేర్చి నందుండు పూలు గోసియొసంగ
సరము లందముగ సుందరి రచించు
మెలఁత వర్ణమ్ములు మేళవించియిడంగ
హరువ్మై నతఁడు చిత్తరువు వ్రాయుఁ
బతి సుకుమారభావము వచించిన నను
రూపపద్యమునఁ గూర్చును లతాంగి
అతివ చక్కని రాగ మాలపించిన వీణ
పలికించు నతఁడు మై పులకరింప

నెఱ్ఱసెరల నందునిచూపు లింతి యాన
నేందునకుఁ గెంపుల నివాళు లెత్త, నతివ
కజ్జలపుఁజూడ్కి ప్రియుని వక్షఃకవాటిఁ
గట్టుఁ దోరణములు నల్లకల్వపూల.

ప్రాలేయగిరికందరావినోదవిహార
పరులైన సిద్ధదంపతు లనంగ
విబుధతరంగిణీవీచికాడోలలఁ
దూఁగెడి రాయంచదోయి యనఁగఁ
గవిమనఃపంకజాసవసిక్తమై రసా
గ్రమున నాడెడి పదార్థము లనంగ
నానందపరిఫుల్లమానీంద్రదహరతా
రాధ్యమం దాడు జీవాత్మ లనఁగఁ

జీవుచింతల దిగఁద్రావి, చెన్నుమిగిలి,
హృదయసంవేద్యమయ్యు, నాత్మైకగమ్య
మైన యద్వయసౌఖ్యరసామృతమ్ము
ననుభవింతురు వారు నిరంతరముగ.

బ్రతుకు నిక్కమ్మయేని యవ్వారిపట్ల
విరతిలేని స్వప్నమ్ముగా జరుగఁబోలు,
బ్రతుకు నిక్కముగాక స్వప్నమగునేని
సత్యమై తోఁపఁబోలు నాజంపతులకు.

ఐహికవిచారముల నెల్ల నవలఁద్రోచి
భంగమెఱుఁగని యానందపరమయోగ
రతి మెలంగుచు, భానుని రాకపోక
లరయనేరనివేళ సుందరియు నొకట.

తనకున్ బాపట చక్కదిద్ద, సుమనోదామమ్ము వేణీభర
మ్మునఁ గూర్పన్, గలపమ్ము లద్దఁ, దిలకమ్మున్ దీర్ప, వింజామర
మ్మును దాల్పన్ సడిసన్న నందుని కరాంభోజాతయుగ్మమ్మునన్
వనితారత్నము దర్పణమ్ము నిడి నిల్వంజేసి తా నంతటన్.

అద్దములోన నీడయును, నద్దము దాల్చిన నాథుమోమునన్
ముద్దులుగుల్కు మీసముల పొల్పు గనుంగొనుచున్, మృగీమదం
బద్దిన యంగుళీకిసలయమ్మునఁ జెక్కులఁ బత్రభంగముల్
దిద్దుకొనందొడంగె సుదతీమణి నేరుపుమీఱ నవ్వుచున్.

లలన కపోలదర్పణములన్ రచియించెడి పత్రభంగముల్
తెలితళుకొత్తు ముత్తియపు దీధితులన్ గడకొత్తు లేఁతన
వ్వొలయఁగఁ జూచునందుఁ డపు డుష్ణానియూఁదిన, నూర్పు తుంపురుల్
తళతళలాడుచున్ మెఱయు దర్పణమున్ గనుమాయఁ జేసినన్.

నాతియు నాథు తుంటరితనమ్మునకున్ మది మెచ్చుపుట్టియున్
జేతము డాఁచి, తెప్పతుదఁ జిందెడు చిర్నగ వప్పళించి, గో
పాతికపాయవీక్షణశితాస్త్రపరంపర జాఱఁ, గెంపుడాల్
వాతెఱ కంపమందఁ గుటిలభ్రుకుటీకలలాటపట్టయై.

'ఈ పలుగాకిసేఁత లివియెల్లను నేర్తువు లెస్సలాయె, నే
నోపను జు'మ్మటంచు శ్రవణోత్పలముల్ గొని వైచెఁ గాంతునిన్;
నూపురకంకణక్వణమనోహరయానముమీఱ మారుమో
మై పెడఁబాసిపోవుసతి కడ్డముగాఁ జనుదెంచి నందుఁడున్.

పైఁటచెఱంగు పట్టి నిలుపన్, జెలి కొంగు తెమల్చికొంచు 'ము
ష్మాటికి నన్ను ముట్టెదుసుమా! యిదె యొ' ట్టని ముట్టఁబల్క, 'స
య్యాటకు నుహ్వాటన్న యలుకా? ములుకుల్ వలె డెంద ముచ్చిపో
నాటెదు వాడిచూపు లలనా!' యని ముట్టెను దత్పదద్వయిన్.

మౌళితలప్రఫుల్లకుసుమమ్ములు మున్నుగ రాల, నాగతిన్
వ్రాలి తదంఘ్రులన్, వెఱపు పైకొను చూడ్కి మొగమ్ము నెత్తి 'న
న్నేలిన దేవి! చూపుటురు లేల బిగించెదు మోము ద్రిప్పి, గ
గ్గోలుగఁ ద్వన్మనఃప్రియశకుంతము నాహృదయమ్ము కూయిడన్.

దోసముగల్గె నావలన దోసిలియొగ్గితి నేలుకొమ్ము, నీ
దాసుఁడ' నన్న కాంతుఁ గని, తన్వి పకాలున నవ్వి, 'యింతలో
నే సడలెన్ గదోయి, యిసిసీ! మనబింకము లింతపాటివా,
కాసరకూసరైతి' వని, కౌఁగిటికిం డిగి చెక్కుడువ్వుచున్.

'కటకట! పాపపుంగినుక గైకొని, యబ్రపుఁగెంపువన్నియన్
బుటపుటనైన మత్ప్రియు కపోలము వెల్వెలవాఱఁ జేసితిన్
గటికయెడంద దాన' నని, కందిన నందుని నిందుడెంద మూ
ఱటగొనఁ, జెక్కుటద్దముల రాగము చిందఁగ ముద్దుపెట్టుచున్.

'సాంత్వనమృదూక్తిచతుర! విస్రంభకార్య
నిపుణ! మన్నాథ! దరిలేని నీ యగాధ
హృదయరాజ్య మేకచ్ఛత్ర మేలఁజూతు,
నెట్లు మన్నింతొ? యీ లఘుహృదయురాలి.

అపరాధప్రియ కారితానవనవంబౌ ప్రేమ లీలాసుధన్
గృపమై మచ్చపలాంతరంగమున సిక్షేపించి, యీ దాసురా
లిపయిన్ జూపు ననుగ్రహమ్మునకుఁ గల్పింతున్ మదాత్మాంబుజ
మ్ముపచారమ్ముగ నల్పమంచనక యెట్లో స్వీకరింపంగదే.'

అని మనఃప్రియముగ్ధభాషణము లలర
నక్కునన్ వ్రాలిన లతాంగి నాత్మఁజేర్చి,
పాపటన్ జక్కదిద్దుచు ఫాలతలము
ముద్దుగొని, తేరకొన నాతిమోము గాంచి.

'అలుక మొయిళ్లమాటునఁ ద్వదాస్యవిధుండు ముహూర్తముండి యు
జ్జ్వలదరహాసచంద్రికలు పర్వఁగ వెండి ప్రసన్నుఁడౌట యో
కలికి! వినూతనోత్సవము గాదొకొ? యిర్వుర మిట్లు సాఁకు పె ని
న్వలపులకల్పవల్లి కతివా! యివియే గద దోహదక్రియల్.

పాణిద్వంద్వము నూని కౌఁగిటఁ గదింపన్ జూతు నిన్, నీదు వి
న్నాణంబున్ మఱి దోయిలింపఁదలఁతున్, నాచూడ్కులన్ ద్రావుదున్
నీ నవ్యామృతవీక్షణమ్ములను, నీ నిశ్వాససౌగంధ్య మా
ఘ్రాణింతున్ మెయియెల్ల ఘ్రాణములుగాఁ, గైమోడ్పు నీ చెల్వకున్.

రాగరంజిత మన్మనోరత్న మింత
యింత శకలమ్ము లొనరించి యింతి! నీదు
కంఠహారమ్ము నొనరింతుఁ, గడమయిడక
వినుతు హృదయప్రబంధమ్ము విశదఫణితి!

వెలఁది! యీ రాగలతలు పుష్పించునట్టు
లీ మనోరథములు ఫలియించునట్లు
దరు లొరసి పాఱు నీమమతాస్రవంతిఁ
దేలిపోదము వెఱతలం పేల మనకు?

అరమరలేని కూరుముల నాడుచుఁ బాడుచుఁ బ్రేమశీధుపా
నరతులమై చరింతము, మనస్విని! చెక్కులఁ బత్రభంగముల్
విరచనసల్పుకొ మ్మనుచు, వెండియు మండనసాక్షిభూతమున్
సరసుఁడు దాల్చి నిల్చెను హసన్ముఖుఁడౌచు మెఱుంగుటద్దమున్

దర్పణముఁ దాల్చి నిల్చిన ధవుని మోము
నెడనెడఁ గనుంగొనుచు రచియించుకొనియెఁ
జెలియ నునుఁజెక్కులందు విశేషకమ్ము
నెమ్మొగమ్ము సశైవలాబ్జమ్ము దొరయ.

ఉడురాజోపలఘట్టనాసుభగమై వ్యోమమ్ముఁ జుంబించు మేల్
పడకింటన్ లలితోపభోగకలనాపారీణుఁడై నందుఁ డా
మడఁతిన్ గూడి యిటున్నవేళఁ, బిలిచెన్ మధ్యాహ్నభిక్షార్థియై
గడపన్ మెట్టిన గౌతముండు 'మమ భిక్షాం దేహి' యన్ వాక్కునన్.

అనుజన్మావసథం బఁటంచు మది నెయ్యం బూనునో, లోనికిన్
జనునో, నెమ్మొగమెత్తి కన్గొనునొ నిస్సంగుండు శాక్యర్షి ని
ల్చెను దద్దేహళి నన్యగేహములఁబోలెన్ తెప్పపాటంత, పో
యెను దారిం బడి 'యస్తి నాస్తి' యను పల్కెందున్ వినన్ రామిచేన్.

అగురుగంధమును లొద్దుగపూలపిండితో
నలుఁగులు నూఱును జెలువ యోర్తు
నీహారవారి పన్నీరు సాఁబాల్లుగా
నీరాటకై కల్పు నెలఁత యోర్తు

కమ్మకస్తురిని సాంకవగంధమును గూర్చి
కలపమ్ము మేదించుఁ గలికి యోర్తు
పచ్చకప్పురము జాపత్రిరిఁ జేర్చి త
మ్మలపుఁజిల్కలు చుట్టు మెలఁత యోర్తు

పూవుబెత్తులు గ్రుచ్చుఁ బూఁబోఁడి యోర్తు
భర్తృకార్యార్థ మటునిటుఁ బఱచు నోర్తు
ఊడిగపుఁగాంత లిట్లు నియుక్తలగుట
నెవరు విందురు బుద్ధయోగీంద్రుపిలుపు ?

చెంగుచెంగునఁ బర్యాయసేవకొఱకు
నగరి కప్పుడు చనుదెంచు నాతి యొకతె
యీ చరిత్రమ్ము నిటు వెలయింపనున్న
దైవవశమున ముని నివర్తనము గాంచి

'గడితపుఁజెట్ట పుట్టెఁగదె, కార్యనిమగ్నతఁజేసి యింటిలో
నుడిగపుఁజేడియల్ కనఁగనోపరు గావలయున్, మహానుభా
వుఁడు చనుచున్నవాఁ డురక, పూజ్యనిగర్హణనింద స్వామిపైఁ
బడునొ మఱేమొ యేఁ దెలిపివచ్చెదఁ గా' కని నందుచెంతకున్

చని విన్నవింపఁగా, ని
ల్వున నీరయి రాసుతుండు, వుల్కుపులుకునన్
దనప్రాణకాంతమోమును
గనుఁగొనుచున్ బలికె నిట్లు, కళవళపడుచున్.

అన్నయఁటే, మహామహిముఁడట్టె, జగమ్మునవార లెంతయున్
మన్ననసల్పుచున్ గురుఁడు మాకన దైవమునాఁ జెలంగు లో
కోన్నతుఁడట్టె, యిట్లు నిలయోపగతుండయి, భిక్ష వేఁడి, య
న్నన్న—, మఱేమనన్ - మగిడెనట్టె, చెలీ! కను, నాయభాగ్యతన్.

ఎంతప్రమాదము పుట్టెన్
శ్రాంతా! న న్ననుమతింపఁగదె, పూజ్యుఁ డతి
క్రాంతుఁ డగుమున్న చని ప్రా
ర్థింతున్ బాదముల వ్రాలి, తెచ్చెద మగుడన్.

అని సరసీజకల్పమగు నంజలిపట్టి యనుజ్ఞ వేఁడు కాం
తుని గని, వెచ్చనూర్చి, నవతోయజచారువిలోచనమ్ములన్
దొనదొన బాష్పముల్ దొఱఁగఁ, దొయ్యలి 'న న్నెడఁబాసిపోగదే'
యని మెయితీవ తూలఁ, బ్రియుపక్కన వ్రాలి సగద్గదమ్ముగన్

'నా మనోనాథ! నానిధానమ్మ! నాదు
కంఠహారమ్మ! న కనుంగవ వెలుంగ!
గురుచరణసేవ గావింప నరుగునిన్ను
నెట్లువారింతుఁ, గాక నిన్నెట్లు పనుతు?

అనుకొననట్టి యీ విరహ మక్కట! తారసిలెన్ గదా! ప్రియా!
మనసు వశమ్ముగాక పలుమాఱు ననర్థము శంకచేసెదన్,
జని యటనే విలంబనము సల్పకుమా! యిట నున్నయట్ల నా
యనుఁగ! విశేషకమ్ము తడియాఱకమున్ జనుదేరఁగావలెన్.

పలుకుబడి నింతలో నేగివచ్చి తేని
విడని గోర్వెచ్చ కౌఁగిలివిందు, ముద్దు
దొంతరలు, దొంతరలముద్దు—, లింతయేల
కానిపించెద నా యనుగ్రహమహమ్ము.'

అని యనురాగలాలనము లారఁగఁ, గూరిమిమేరయైన చం
దనఘనసారగంధకలనాకమనీయదృఢోపగూహబం
ధన మెటులెట్లొ విప్పియును, ద న్నెడవీడఁగలేక, వేణుని
స్వనమధురోక్తి వేఁడు చెలువన్ బ్రియుఁ డల్లన బుజ్జగించుచున్.

‘వలవని జాలి పూని నను వారణసేయకు, బేలవై కనుం
గొలుకుల నీరునింప కదిగో! గురుదేవుఁ డతిక్రమించెడున్
జెలి! కనుచూపుమేర, ననుఁ జెచ్చెర నంపినఁ దత్సపర్యలన్
సలిపి భవత్పదాంబురుహసన్నిధికిన్ జనుదెంతు నింతలో.’

అనుచు నూరార్చి, పత్రసమంచితమగు
నాననమ్మును దడవి ముద్దాడి, రాజ
సాతిరంజితచిత్రాంబరాళితోడ
సందుఁ డున్నట్టులే పయనమ్ముగాఁగ.

నిక్కిన వీనులున్, జడత నెక్కొను చూపులు, విన్నఁబాటునన్
స్రుక్కిన మోమునై పరక త్రుంచక నిల్చు కురంగియో యనన్
జక్కెరబొమ్మ యంతఁ జలనమ్ములు చూడ్కుల ధ్యానమగ్నయై
చెక్కిటఁ జేయిచేర్చి నిలిచెన్ బికుబిక్కని, కాంతుఁ డేగఁగన్.

బుద్ధగతమైన పెనుభక్తి ముందు లాగ,
వెలఁదిపై రక్తి లాగె వెన్వెనుక కతని;
నూర్మికలమధ్య హంసనా నొప్పె నపు డ
నిశ్చయమ్మునఁ గదలక నిలవ కతఁడు.

ఎడయని ధర్మరాగ మెటులే నొక ముందడుగేయ, రెండుమూఁ
డడుగులు ప్రేమధర్మ మపు డాతని వెన్కకుఁద్రోయు, నీగతిన్
విడువక యొయ్యనొయ్యఁ బెనువెల్లువపై నెదురేగునట్టి య
య్యుడుపమువోలె నేగె నెటులో యడుగడ్డున వెన్కత్రొక్కుచున్.
ఇటు లొకకొంత యేగి, తుద కేమగునో గురుఁడన్న భీతి యొ
క్కటఁ, దడియాఱునో మకరికాలత యన్న భయం బొకంట ను
త్కటమయి పైకొనంగ వెసఁగాల్కొలదిన్ జనఁజొచ్చెఁ దా హుటా
హుటిఁ బెదపెద్ద యంగలిడి యూర్పులు ఘోరములై చెలంగఁగన్.

ఇది
ద్వితీయసర్గము

హితము నహితమ్ము, నుచితానుచితముల నెడి
హద్దుల నతిక్రమించి, ఫలానుమేయ
ములగు నార్యశుభారంభములకు స్వస్తి
యగుత, విశ్వమ్మునకు శ్రేయమగునుగాత!

# ప రి వ్రా జ న ము

గౌతమమునీశ్వరుండు నివాతదీప
కళికపోలిక నిశ్చలకాంతిరాశి
యై వెలుంగుచు మేరుమహాద్రి నడచు
పోలుపు దోఁపఁగ నరుదెంచె పురమువీధి.

ఆడుచుఁ బాడుచున్ బురమహాపణభాగ్యవినోదవైఖరుల్
వేడుకఁ జూచుచున్ బురికిఁ బెట్టనిసొమ్ములువోలె వాహనా
రూఢత నొప్పు రాచకొమరుల్ దవుదవ్వులఁ జూచి ముగ్ధులై
'వాఁడె గురుండు రం'డని యవారిగ నొండొరు మూదలించుచున్.

కడువడి వాహనములు డిగి
నడుములు బిగియించి వినయనమ్రములగుచు మ్రొ
క్కిడి రెల్లరు సాఁగిలఁబడి
పడుచుఁదనము రాచదనము ప్రక్కల కొదుగన్.

మునియును గేలు సాఁచి, 'భవమోచనమ' స్తని వారికెల్ల దీ
వనలిడి, ముందు సాగి నడవన్ గమకించెడునంతలోన, నా
పణముల నమ్మువారుఁ గొనువారుఁ దటాలునఁ జూచి సంభ్రమం
బున నెటులున్నవా రటుల మూఁగిరి తత్కరుణాబ్ధి చెంగటన్.

అఱిముఱి నొండొరున్ గడచి యంఘ్రులపైఁ బడి లేచువారు కొం
దఱు, నెఱచూడ్కులందక పెనంగుచు బాహుల నొత్తువారు కొం
దఱు, కనుఁగొన్నమాత్ర నయనమ్ముల బాష్పము లుప్పతిల్ల నాం
తరపరిపూర్ణభక్తిసుఖతాత్క్షణసిద్ధులు కొంద ఱాజనుల్.

క్రందదరన్ గతానుగతికమ్ముగ మూఁగుజనమ్ము నశ్రువుల్
చిందెడిచూపులన్ నెనరుచిక్కెడి పల్కుల నాదరించి, మా
నీంద్రుఁడు నద్దెసల్ కలయ నీక్షణపంక్తులు సాఁచునంతలో
సుందరిప్రాణనాథుఁ డొకచోఁ గనవయ్యె ససంభ్రమాత్ముఁడై.

విడివడి వ్రేలు పెన్నెఱులు వీథికిఁ బూల నివాళి యెత్త, నొ
ప్పెడు వదనమ్మునన్ బొడము స్వేదకణమ్ములఁ దోఁగి చండభా
నుఁడు బహువర్ణతన్ బహుమనోహరరూపములన్ నటింప, నం
దుఁడు గురుఁడున్న యయ్యెడకుఁ దొందరగాఁ జనుదెంచి ముందటన్

దిక్కులకెల్లఁ జాలి, మఱి దివ్యులకైనను దేఱిచూడఁగా
వెక్కసమైన తేజమున వెల్గుచుఁ బుట్టువులేని దారికిన్
డెక్కెమువోలె నున్న గురునిం గని, పుల్కలు దేఱి, సుందరిన్
దక్క సమస్తమున్ మఱచె నందుఁడు బాహిరవస్తుజాలమున్.

తేఱి, 'యకట! తడసితిన్ గదే' యనుకొని,
మునివరుని సమీపమునకు నేగఁ
దొడరి, సందులేమి దోబూచులాడు నా
సరణి జనములోనఁ దిరుగుచుండె.

స్థిరమతి దక్కి పెన్ గజిబిజిన్ గొనియున్న నృపాత్మజున్ మునీ
శ్వరుఁ డపుడే కనుంగొనె, నపారమహాజనతాప్రవాహసం
తరణకృతప్రయత్నుఁడయి దాఁటి వివిక్తపథమ్ము చేరె నొం
టరియయి తమ్ముఁగుఱ్ఱ కచటన్ దగుదర్శన మిచ్చుకోర్కెమై.

ఆ యవకాశలబ్ధికి ధరాధిపసూనుఁడు సంతసించి, భ
ద్రాయితమూర్తి గౌతముని దాపునకుం జని, వక్షమందుఁ గే
ల్దోయి ఘటించి, కొంకున నధోముఖుఁడై, యపరిస్ఫుటాక్షరం
బై యెలుఁ గింత తొట్రువడ నా గురువర్యునితోడ నిట్లనున్.

"ఘోరపా, టపరాధము, దే
వర వాకిటి కరుగుదేరఁ బ్రాసాదతలాం
తరవర్తి నొట నెఱుఁగన్
గరుణామయ! నన్ను సైఁపఁగాఁదగు నిందున్.

మరలి చనుదెంచి యర్థిమై మఱఁద లొసఁగు
భిక్ష గ్రహియింపవే! నిను వేఁడుకొందుఁ,
బాదమూలమ్ము చేరి పెంపేదియున్న
ఛాయ చూడుము, సరి రెండుజాము లయ్యె."

అని వినయమధురముగఁ బ
ల్కిన గౌతమబుద్ధుఁ డతనిఁ గ్రీఁగంటఁ గనుం
గొని, నాఁటి కింక భిక్షా
శన మొల్లమిఁ దెల్పె హస్తసంజ్ఞామాత్రన్.

తెలిపినఁ జిన్నబుచ్చుకొని 'దేవర చిత్తము, పోయివచ్చెదన్
సెల' వని ప్రేయసీముఖవిశేషకదర్శనధర్మలోపసం
చలితమనస్కుఁడై వెనుకచక్కికి మైమయి జాఱుచుండఁగా
నిలు నిలు మన్న చూపొకటి నెక్కొనఁజేసి మునీంద్రుఁ డంతటన్

పూజయు శ్రద్ధయున్ వెలయఁ బుణ్యసతీజన మన్నదానపున్
వ్యాజమునన్ మహాసుకృత మాదట దాఁచెడి పెట్టెనాఁ బరి
వ్రాజకదీక్షకున్ దొలిశుభంబన నొప్పెడి చేతి భైక్షుపుం
భాజన మానరేంద్రసుతు పాణితలమ్మునఁ బెట్టి మౌనియై

సాగినడచుచుండ జననాథనందనుం
డట్టె చూచి, గురుని యాశయమ్ము
పోల్చలేక రెండుమూఁ డడుగులమేర
వెంటనేగి మరల వెనుక దిరిగి,

సదనము మొగమై, మఱి య
య్యది రెండవ తప్పగున్ గదా యనుకొని, బె
ట్టిదముగఁ గటకటఁబడి, యా
సదయుని వెనువెంట మరలసాగి నడచుచున్,

తనకోస మెదురు తెన్నులు
గను నెచ్చెలి బిక్కమొగము కలఁగించుచు నె
మ్మనమునఁ బాఱఁగ, కానీ
యనుకొని వెనుకంజవైచి, యదికాదనుచున్,

మునివర్యు నిలిపి, 'ప్రభూ! యిదియే'మని
నొక్కి ప్రశ్నింపఁగా నోరు రాక
అవిధేయతాశంక ననుసరింపంగ ముం
దడుగు వెంబడి వెన్కయడుగు రాక
పత్రలాంఛితమైన ప్రణయిని చెక్కుట
ద్దమ్ముల నిల్చు చిత్తమ్ము రాక
ఎండలో రేయెండ లీనెడి తనసౌధ
గోపురమ్ముల నిల్చు చూపు రాక

అంతరింద్రియబహిరింద్రియముల కించు
కయును సానుకూల్యము లేని గతియె కాఁగ,
ఎటకో తనపోక, మరల నెప్పటికో రాక
యరయనేరక యవశుఁడై యరుగుచుండె.

నృపసుతు నవ్యవస్థత నెఱింగియు వాని ననుగ్రహించు స
త్కృప మది నిండి, వేఱుతలఁ పించుక లేని మహానుభావుఁ డా
తపసి మనోబలమ్మునను ధర్మబలమ్మునఁ గట్టితెచ్చి, తా
నపగతపుష్పసాయకవిహారవిహారముఁ జేర్చె నాతనిన్.

చేరఁజేరి, యచట శిరము దువ్వుచుఁ జెఱు
చెమట పోవఁదుడిచి, చెక్కు నిమిరి,
యక్కు గదియఁజేర్చి, మిక్కుటమగు జాలి
కతన నిట్లు పలికె గౌతముండు.

'ఉడుగని నడకల నెండన్
గడు బడలితివన్న ! యెండక న్నెఱుఁగవు, నిన్
విడలేక కరుణపెంపునఁ
దోడితెచ్చితి నిటకు నింతదూరము తండ్రీ ?

ఆయెఁబో, దానికేమి మేలాయెఁగాక
భద్రమగుఁగాక నీకు, నీ వాసనాప
రంపరలు మాసి విషయోపరాగరహిత
దివ్యవిజ్ఞానకళిక సిద్ధించుఁగాక.'

అని కడు నాదర మ్మెసఁగ నాడి, వచోనిధి యోగిపుంగవుం
డనియెను వెండియున్, 'వినఁగదయ్య, కుమారక ! యర్థవంతమై
యెనయు విశేషమున్ వినుతు, నీ పడినట్టి పరిశ్రమమ్ము దా
నన ఫలవంతమై తుద కనంతసుఖమ్ము లొసంగఁజాలెడిన్.

పగగొను త్రాఁచుఁబామువలెఁ బ్రాణి జనించినదాది వెంబడిన్
దగిలి చరించు మృత్యువు, విధాతయు దాని వశంబె యన్నచో
మిగిలిన భూతజాలము ప్రమేయము చెప్పఁగనేల, నిత్యమై
నెగడెడి దొండు లేదు, కననేరదు లోకము కన్ను లుండియున్.

తల్లి యొడిలోని బిడ్డను దక్కరించు
బిగువుఁగౌఁగిలి తెగఁద్రెంచి ప్రియులఁ బాపు
నకట ! మృత్యువు నిర్దయురాలు, దాని
లీలకుం బ్రతికారముల్ లేవు జగతి.

నేఁడు గాకున్న రేపుగానీ, మఱొక్క-
నాఁడుగానీ, వియోగ మున్నదియె సుమ్ము
జంతుకోటికి మృత్యువశమ్ముకతన;
నాఁడు విలపించి లాభ ముండదు కుమార!

జరయు రుజయను ఘోరరాక్షసులు మృత్యు
దేవతానేత్రసంజ్ఞ వర్తిల్లు సఖులు,
ప్రాణహరణమునెడఁ జేయవలయునట్టి
కార్యమును ముందె చేయు ప్రగల్భురాండ్రు.

మరువముమొల్క, పుష్పసుకుమారము, నాతను వంచు భ్రాంతులై
మురియుదు రింతెకాని గుణమున్ గననేరరు, చెప్పినన్ గ్రహిం
పరు, గడియల్ దినమ్ములును మాసములున్ ఋతువుల్ గ్రసించుచున్
జర పయింకొన్నవేళ నెఱచక్కఁదనమ్ములు వట్టిపోయెడిన్.

అపుడు తనదేహమే తన కగును రోఁత
ముద్దులాఁడియె తనపాలి భూతమగును
నేఁటి ప్రణయప్రబంధముల్ నాఁటిదన్క
నిలిచియుండవు, పరువము నీటిబుడగ.

కావున దుఃఖహేతువగు కాలము పైకొనిరాకమున్నె సౌ
ఖ్యావహయోగధారణకు యత్నమొనర్పఁగ నుత్సహించి మే
ల్కొవలెఁ, గాక, మన్మథవిలోలమనస్కత నింద్రియార్థసం
సేవ లొనర్పఁజెల్ల దది చేటునకున్ మొదలింటి హేతువౌ.

ఎఱుఁగవుగానఁ బూవిలుతు నేర్తెఱకున్ వశమై విలాసత
త్వరత జగమ్మునే మఱచి వర్తిలుచుంటివి పాప మీవు, నేఁ
డెఱిఁగితిగానఁ గన్ దెఱచి యింతటనైనను సౌమ్యబుద్ధివై
తిరిగి ప్రియావిమోహజలధిన్ దరియింపుము దారిచూపెదన్.'

అని యుపచారదక్షుఁడును నాత్మసముండును నైన శిష్యునొ
క్కనిఁ బిలిపించి యంతఁ ద్రిజగత్పరిపూజ్యుఁడు గౌతముం డనెన్,
'తనయ ! కుమారనందునకు ధర్మపథమ్మున దీక్ష యిమ్ము పొ'
మ్మనుడు, నతండు వల్లెయని యాతనిఁ దోడ్కొనిపోయెఁ గ్రన్ననన్.

పోయి, వలయు యత్నములు సేయుచుండ, నా
వన్నెఁగాఁడు భూమిపాలతనుజుఁ
డొల్లఁబోయి, మోము వెల్లనై గజగజ
లాడి, యిట్టులనియె నతనితోడ.

'నిలుమన్నా ! భిక్షూత్తమ !
వలదన్నా ! నాకు దీక్ష వలదు, నినున్ గా
ళులపైఁ బడి వేఁడెద, న
న్నిలుసేర్పుము, నీకుఁ బున్నెమెంతో యుండున్.

ప్రాణసమానమైన ప్రియురాలిని బాసి, క్షణమ్ము స్వర్గమం
దేనియు నిల్వలేని నను నీగతిఁ జేయఁగఁ బాడియౌనె ? లో
నానయు భీతియున్ గదిరి, నాలుక కుంటిన, నన్నతోడ నే
నానఁ గాదనంగ వెనుకాడితి, సత్యము నీకుఁ దెల్పితిన్.

వరమడిగి నాశరీరము
తరుణీమణి పుచ్చుకొనియెఁ దన సొత్తుగ, నే
దురితముపాలై పోవనె
పరధనమును నిచ్చ వెంట వాడితి నేనిన్' ?

అన, మునిశిష్యుఁ డంతట, ననాదరసూచకమందహాసమం
డనవికసత్కపోలుఁడయి, డగ్గఱి, నందుని కేల్ గ్రహించి యి
ట్లనెఁ, 'గడు బేలవై యెఱుఁగవైతి కుమారక ! సుప్రసన్నతా
ఖని గురునానతిన్ నడవఁగావలదే మన కెంతవారికిన్ ?

ఎంతటి భాగ్యశాలివౌకదే! మహానీయుఁడు, లోకపూజ్యుఁడౌ
నంతటివాని సోదరుఁడ వౌటయు, ధర్మమునందుఁ గూడ నీ
వంతును బంచుకోవలసివచ్చుటయుం దలపోసిచూడుమా!
పంతముదారిఁబోవక శివమ్మగు ధర్మపథమ్ము ద్రొక్కుమా!'

అంచు సరగునఁ గావికట్టించు టాది
ధర్మదీక్షాప్రవేశతంత్రమ్ము లెల్ల
నడపి నవమన్మథాకారు నందసుతుని
క్షణములో భిక్షుమాత్రుగా సల్పుచుండ.

సుడివెట్టి లోఁగొను నడిసంద్రపుఁ దుపాను
గడవనీఁదెడి యీఁతగానివోలెఁ
గలయ నద్దెసఁ బన్ను వలఁ జిక్కి బయటికి
నుఱికిపాఱఁ దలంచు నుడుతవోలె
అసమయాగతులైన యమకింకరులబారిఁ
బడక దాఁగఁగఁజూచు ప్రాణమువలె
భయదవృత్తాంతదుస్స్వప్నంబునుండి మే
ల్కొనలేక కలఁగెడి మనసువోలె

భిక్షుమండలిచేఁ జిక్కి, పెనఁగులాడి,
వేఁడుకొని, బిట్టుగా విలపించి, కసరి,
విసివి, చేష్టలుదక్కి, సొమ్మసిలి వ్రాలి
సుందరీప్రాణధనము భిక్షులకు దక్కె.

ఇది
తృతీయసర్గము

అంకమునఁ బుట్టురత్నము నవధరించి
మఱియు బంగారమును వేఱుపఱచి, పుటము
వెట్టి, తన్మణి సానపైఁ బెట్టి, యట్టు
లొరయుచుంటి వేభూష చేయుదువో కాని!

# నిరీక్షణము

ఆగతి నందసుందరు మహాముని లోఁగొనిపోకయున్ మొదల్
గాఁ గడచన్న కార్యము లోకందు నెఱుంగని బాల, నాథు ప్ర
త్యాగమనప్రతీక్ష నట హర్మ్యగవాక్షగతాననాబ్జయై
సోగలు తీఁగలై మలయుచూపులు చూచుచు నిల్చె దిక్కులన్

ఈదారిఁ జూచుఁ, బదపడి
యాదారిం జూచుఁ, గలయ నంతటఁ జూచున్.
'గా' దను, 'నగునా' యనుఁ, 'గా
నీ! దండింపకయె విడుతునే యితని' ననున్.

తన వెనుక వచ్చి నిల్చెనొ
యనుకొని వెనుదిరిగి చూచు నాసమెయిన్, జ
య్యన మఱి వీధులదెసఁ గనుఁ
గొనుఁ, దాఁ దన నీడ చూచుకొని యుల్కిపడున్.

తడవుగ నిట్లు నిల్చి, ప్రియుదర్శనభాగ్యము లేమిఁ జేసి మ
ల్లడిగొని దండడించెడి తలంపులు సత్తువ డిందుసేయ, నా
పడఁతుక నిల్వలేక నునుఁబాన్పున వ్రాల్చెఁ దపించుమేను; క్రూ
రుఁడుగద మారుఁ, డాతనికిఁ గ్రోధుఁడు తోడఁట, యేమి సెప్పుదున్

కాంతుండు మేలేర్చి కబరీభరమ్మునఁ
జెఱివిన క్రొన్ననల్ చెదిరిరాల
ముప్పేట రతనాలు సోహలించిన కంఠ
హారాలు చిక్కులువాఱి పెనఁగ

దారమ్ము తెగిన ముత్యాలకోవయుఁబోలె
బోటబోట కన్నీటిబొట్టు లురుల
నావిదేఱుచు స్విన్నమా మోము పరితప్త
హృదయస్వభావమ్ము నెఱుఁగఁజేయఁ

దళుకు మొగములు సమ్మాళిగలు పదమ్ము
లందు నిల్వక జాతి వ్రేలాడుచుండ
నోడలు తెలిసియుఁ దెలియని యునికి దోఁప
నడ్డముగ వ్రాలె బాల పర్యంకడోల.

'హా' యనె బాలామణి, 'య
క్కా' యనె రాచిల్కకోదమ, కలఁతపడి యెదిర్
జేయఁగఁ జేయాడక 'యే
మే?' యనెఁ జెలికత్తె యొకతె యింకొక చెలితోన్.

సింగారమ్ముల నెల వా
బంగారపుబొమ్మ యిట్టిపాటు పడఁగ, స
ర్వాంగీణమ్ముగ నగరున
మాంగల్యము వాసి, మసకమసకలు గ్రమ్మెన్.

కళలకునెల్లఁ బాసి కొడిగట్టిన దీపమువోలె నున్న యా
నిలయమునందు నిల్చుటకు నెమ్మది గొల్పక తత్తఱమ్మునన్
జెలియ యొకర్తు, 'రాకొమరు నిక్కవ మారసివత్తు' నంచుఁ దా
ట్రిలు పద మూఁది నిల్చికొని డిగ్గెను సౌధము మెట్లవెంబడిన్.

ఆరవళి చెవ్వులఁబడి, వి
ప్పారిన నెమ్మోముతోఁ జవాలున లేచెన్
నారీమణి, 'వచ్చెనుబో,
నా రా' జనుకొని ప్రియమ్ము వనలెత్తంగన్.

'ఎదురేగి బిగ్గఁ గౌఁగిటఁ
గదియించెద, నింత తడయఁగా నగునే? యం
చదలించెదఁ, దత్సాంత్వన
మృదూక్తు లాలించి యెదకుఁ దృప్తి ఘటింతున్.'

అనుచు వేడ్కలు భావించుకొనుచుఁ గదలి,
యొక్కకంటను జలునగ నొకటఁ దెచ్చి
కోలుకోపమ్ము తుంపురుల్ గురియుచుండ,
నడుగుకంటె నెడంద ముందడుగు వేయ

చని, సోపానతలము దెస
గనుఁగొని, నిట్టూర్పు విడిచి గ్రక్కున మరలెన్
అనిలవశమ్మునఁ జని, క
ట్టును డీకొని తిరిగి సుడివడు పడవరీతిన్.

తూలుచు సోలుచున్ మరలి, తొయ్యలి సెజ్జఁ బరుండి, మీలితో
న్మీలితనేత్రయై, మనసునిల్కడలే కుపవిష్టయై, తమిన్
బేలతనమ్ముఁ గిన్కయును వెక్కసమై, చిగురాకువంటి కెం
గేల మొగమ్ము గప్పికొని కీడ్వడి యేడ్వఁదొడంగె వెక్కుచున్.

మనసులో మనసు గలిపి, మాటలోన
మాటయును గల్పి, యొరిమయు మమత నెఱపు
జీవితేశ్వరుఁ డిట్లు వంచించె నన్నుఁ;
గలరె నాకంటె మందభాగ్యలు జగాన? !

'నీనయనమ్ములాన, గురునిన్ గని మ్రొక్కెడి యింతలో ననా
శ్యానవిశేషకమ్ము భవదాననలక్ష్మి భజింపవత్తుఁ గా
దా, నను నమ్ము' మంచు శపథమ్ములు పల్కిన ధర్మవృత్తికిన్
హానియొనర్పలేక సరియంటిని దత్ఫల మిట్టు లయ్యెఁబో.

అదిప్రాణం బిది దేహం,
బది దేహం బిదియె ప్రాణ మనుకొంటిని, మా
పదిలంపుఁ బ్రేమభంగికిఁ
గొదవలు వాటిల్లు టెఱిఁగికొన నైతినిగా.

సాధుతాసుందరమ్ముగు నాథు వర్త
నమ్ము కపటమ్ముగా నేను నమ్మఁజాల,
నాత్మకున్ నీడయైన ప్రేయసిని మఱచి
యొందుచో నిల్చుటన్ నమ్మకుండఁజాల.

మచ్చలేని చందమామసోయగమును
ధిక్కరించు మోముతీరు గాంచి,
మఱులుగొల్పి చెట్టనూయలు పచరించి,
యెవతె యాఁచికొనెనో యిల్లుసేర్చి ?

ఆరసభావ మా నెనరు లామురిపమ్ములు నట్టిసుద్దు లా
తేరిన పొంకముల్ కళలు తేరిన కూర్ములు కుస్తరింపు లా
గారము లెల్లఁబోయి, పెఱకాంతకుఁ జిక్కుటయైనచో, నమ
స్కార మొనర్పఁజెల్లెడినిగాక, మఱేమనఁ జంచలాత్మునిన్ !

అవికలమ్మును నద్వితీయమ్మునైన
ప్రణయపరతత్త్వవిదుఁడు నాప్రాణవిభుఁడు
వాని చిత్తమ్మెఱింగియు, లేని పాప
శంకఁ దడవితి నెంత దోసమ్ము కలిగె.

కిసలయకోమలున్ మొరటు కీల్జడప్రేటుల నొవ్వఁజేసితిన్,
విసువు జనించునట్లు తమి వేళఁ బరాఙ్ముఖనైతి, నిట్టి వే
దొసఁగుల నెన్నిచేసితినొ! తోడనె తత్ఫల మిట్లు పండి ప్రా
ణసఖు వియోగరూపమున నన్నెరియించెడు నేమి సేయుదున్.

జంకెన చూపులు నూరక
మంకుతనమ్ములును దురభిమానపు బిగియుల్
వంకర సేఁతలుఁ, బలుకన్
సుంకము వేఁడుటలు నెన్ని చోద్యము లకటా!

పంతముఁ బూననంచుఁ బదపద్మములం బడి వేఁడికొందు నా
కాంతుని నామనోనయనకాంతుని నంగజసార్వభౌము సా
మంతుని దోడితేఁగదరె! మాడలు మాన్యము లిచ్చి మిమ్ము మె
ప్పింతును, వేయునేల మఱపింతును మీ పరిచారికాత్వమున్.

నా చెలికాని, నా గురుని, నా కనుఁదమ్ముల మోమునీడలన్
జూచెడివాని, నా మనసు సొంపు నెఱింగినవానిఁ నాకుఁ జే
సాఁచెడివాని, నాదు కనుసన్న మెలంగెడివాని, నాప్రభున్,
నా చిగురాకు బాఁకుదొర, నా సకలమ్మును దెచ్చియీయరే!

అనుచు వంతఁబొరలు నంగన నూరార్ప
వెరవుదోఁప కంతిపురిలతాంగు
లొకరిమొగము లొక్క ఱరక కన్గొనువేళ
జాడనరయఁ జనిన చేడె వచ్చె.

వచ్చినదానిఁ గన్గొని ప్రభాతవివర్ణవిధూపమాస్యయా
నచ్చపలాక్షి, యాసయు భయమ్మును శంకయుఁ దోఁప, 'నెచ్చెలీ!
వచ్చుచునున్నవాఁడె? తెలుపన్ గదవే, ప్రియుఁ డింతసేపు దా
నెచ్చటనున్నవాఁడె, నిను నేమనె, నేటికిఁ దామసించెనే?'

అని పలుభంగుల నడిగిన
దనకున్ బ్రతిచెప్పకున్న దాని మొగమ్మున్
వనితామణి తప్పక క
న్గొని, యాస కృశించి, కినుక గూరిన వగతోన్.

'అశ్రుసిక్తమ్ములైన నేత్రాంచలములె
చెప్పుచున్నవి వాని దుశ్చేష్టితమును,
అయిన నోట వచింపు మేమనియె నతఁడు,
రాను పొమ్మనెనో, కానరాఁడొ చెలియ!'

అనుటయు నా యంగన యి
ట్లనెఁ, 'గడఁగియు జాడ తెలియనైతిని దల్లీ!
జనములు తలకొక విధమున
వినిచిరి, యొక్కరును దత్ప్రవృత్తి యెఱుఁగమిన్.

జనము క్రందుగనున్న సమయంబునన్ జుట్టు
తిరుగుచుండె నటంచుఁ దెల్పె నొకఁడు
అన్నతో నేకాంతమాడుచు నుండె నా
వీధిమూల నటంచు వినిచె నొకఁడు
అచటనే గౌతముం డందిచ్చుపాత్రమ్ము
చేతఁ గైకొనె నంచుఁ జెప్పె నొకఁడు
ఆపాత్ర దాల్చియే యతిపుంగవు పిఱుంద
నంతంత నేగె నం చనియె నొకఁడు

వార లిర్వురు బౌద్ధవిహారమునకుఁ
బోవు మార్గమ్మునన్ గూడి పోవుచుండఁ
గాంచితి నటంచు నొకఁ డెఱిఁగించెఁగాని
నిక్క మెఱిఁగి వచించు మానిసియె లేఁడు.'

అనుచున్ గద్గదకంఠియై వినినవృత్తాంతమ్ము విన్పింప, లో
చనపద్మమ్ములు విచ్చి హస్తయుగ మాస్ఫాలించి నిట్టూర్చి, ని
ల్చెను గాంతామణి పాలరాప్రతిమవోలెన్ జేష్టలందక్క, యం
తన 'హా' యంచు శరాహతాండజమునాఁ దన్వంగి వ్రాలెన్ భువిన్.

అంత వయస్యలెల్లరుఁ 'గటా! యెటువంటి యవస్థ వచ్చె, భూకాంతుని బిల్వరే' యనుచు 'గౌతమదేవుని చెంత కేగి వృత్తాంతము దెల్పరే' యనుచు 'నయ్యయొ, ప్రాణము నిల్పుమార్గముఁగాంతముర్రారె' యంచును నొక ళ్ళొకరీతిగ నాడుచుండఁగన్.

ముదుసలిపడంతి యొక్కతె
పదిలముగాఁ జెంతఁజేరి, ప్రాణము మరలన్
గుదుటంబడు నుపచారము
లదియును నిదియును బొనర్ప నయ్యంగనయున్

క్రమముగ దేహమున్ దెలిసి, గౌతమదేవునితోడనే విహారము దరియంగనేగెఁ దన ప్రాణవిభుం డనుమాటకున్, బ్రియా విముఖత సర్వమున్ విడచి భిక్షుకులమ్మును జేరె నన్న యర్థము సరిపోల్చి చూచికొని, దాని నిరాకృతిగాఁ దలంచుచున్.

'ఔరా! యభినయవిద్యా
పారంగత! వంచకాతివంచక! రసభా
వారంభప్రతికూలవి
చారా! సౌహార్దధర్మసమయవిదూరా!

అడవుల కేగి భిక్షుల విహారములన్ భజియించి, కావికచ్చడములు గట్టు నీరసపు శాంతమె నీకు నిసర్గమైనచోఁ గడునయగారముల్, వలపుఁగమ్మఁదనమ్ములు, ప్రాణమిచ్చు ప్రేముడులు నటింపనేల? నను మోసముచేయఁగనేల ధూర్తుఁడా!

అమృతపరిపూర్ణమైన పాత్రమునయందుఁ
జేతులారఁగ విసము పోసితి వయారె!
అనుభవింపఁగ మనసు లేదయ్యె నేని
పాత్రమును దొల్తఁ బూరగింపంగ నేల?

నీదు నెమ్మోము గాంచెడి యదృష్టము గోలు
            పోలేక కన్గవ మూయ వెఱచి
కనుఁబాటు తాఁకునో యనుభీతిఁ దడవు చూ
            డఁగనీక చూపులు తిగిచిపట్టి
జుణిఁగిపోవునో యేమొ యను చింతఁ గనుఱెప్ప
            పాటుకాలము కేలువదల వెఱచి
కనుగందునో హస్తకిసలయ మ్మనుశంక
            బిగువుఁగై దండ కూర్పఁగఁ దలంకి

            తీవ్రమైనట్టి ఖడ్గధారావ్రతమ్ము
            సేయుచుంటిని నిన్ను భజించుకొఱకుఁ
            జిత్త మెఱుఁగక నన్ను వంచించితౌర!
            పున్నె మార్జింతువో! మోక్షమును గడింతో!

కూరిమి తోఁబుట్టువుల విస్మరించి యా
            నెయ్యమ్ము నీమీఁద నిల్పుకొంటి
అరమర లేని వయస్యులఁ బెడఁబాసి
            చెలిమి కేల్ నీమూపుఁ జేర్చికొంటి
జననీజనక సేవ చాలించి నీదు పా
            దమ్ములే దిక్కని నమ్ముకొంటి
ఇలువేలుపుల పూజ కెడసి నీపరిచర్య
            చాలు నాకని సంతసమ్ముపడితి

            అన్ని భావముల్ త్వత్ప్రణయాగ్నియందె
            యాహుతులు వేల్చి నేశూన్యనైతి—నింక
            నేమిగతిఁ బోదు—నెవ్వారి నేమి యందుఁ—
            దెలివిమాలిన నన్నె నిందించుకొందు.’

అని విభుని బదరి, పదరుటఁ
గినుకభరమ్మును నొకింత కీడ్వడి, మఱి యీ
పని ప్రియుఁడు తనకుఁ దా దొరఁ
కొనునా, యనుశంక యలముకొని చిత్తమునన్.

అతనుండె సర్వదైవతకులాధిపుఁడంచు
సన్నజాజుల పూజ సల్పుచుండు
వలరాజె నిత్యయౌవనసంపద నొసంగు
వరదుఁ డంచంజలి పట్టుచుండు
నంగజుండే యువాభ్యర్చనీయుండైన
గురువని పాదముల్ గొలుచుచుండుఁ
గంతుఁడే శృంగారకళల పెన్నిధి యంచుఁ
బరవశుండై పాటపాడుచుండు

నట్టి మన్మథసేవకుం, డట్టి మన్మ
థాతిమన్మథుఁ డింతలో యతిజనోప
భోగ్యవైరాగ్యపద్ధతిఁ బూనెఁ దనకుఁ
దానె యనుకొంట నమ్మఁగారాని దకట!

భావించిచూడ నింతకుఁ
బావనుఁ డా గురుఁడె మొదలు, బలవంతముగా
నో, వేఱువిధముగానో
నావల్లభు డక్కఁగొనియె నన్నిటుచేసెన్.

అని నిశ్చయించి, గురు నే
మనుటకునున్ నోరురాక, యల్లంతన మె
త్తని కినుకతోడ గౌరవ
మొనసెడి వాక్యముల నతని నిట్లని మొంచెన్.

చల్లనిచూపు, తీయనివచస్సు, దయామృతసారవాహినుల్
వెల్లువలైన చిత్తము భువిన్ ద్వదధీనము లొందుచోటులన్
జెల్ల వటంచు గాథల వచింతురు, చెల్లెలివంటి నాయెడన్
బొల్లయిపోయె నేమయ! ప్రభూ! భవదార్తజనావనక్రియల్.

నాయెడ నించుక పొరపా
టే యున్నదియనుము, దాని కింతటిశిక్షన్
జేయుట నాయమ? మరణం
బే యుచితముకాద, భర్తృవిరహముకంటెన్.

దోసమొనర్చుచుండుటయు దోసిలి యొగ్గుట మాకుఁ జెల్లు, నా
దోసము లెల్ల సైచి తఱితో దయ సూపుట మీకుఁ జెల్లు, నా
హా! సకలాగమార్థనిపుణా! పరిపూర్ణదయాపయోధి! నా
దోసము పెద్దచేసి తలద్రుంచితి వేమయ! బోధపుష్కలా!

శోకరూపిణియైన యశోధరాంబ
కీతఱిన్ దోడికోడల నైతి నిజము;
శాక్యకులమును మెట్టిన సతులకెల్ల
భర్తృవిరహమె నోముల ఫలమ? దేవ!

'గౌతమగోత్రజుల్ పరమకారుణికుల్, సుకృతాత్ము లయ్యెడన్
మాతృవియోగచింత యను మాట యెఱుంగక యుండెదమ్మ, త
ల్లీ! తలరన్ బనేమి' యని, లేని వికాసము దోఁప, నన్ను మీ
చేతులఁ బెట్టునప్పుడు వచించెను మాజనయిత్రి గౌతమా!

తమ్ముఁడు పాదపద్మముల దాపునకున్ జనుదెంచి మ్రొక్కఁ, బ్రే
మమ్మున నాయురభ్యుదయమంగళముల్ విలసిల్లున ట్లమో
ఘమ్మగు దీవనల్ సలుపఁగా దొరఁకొందురుగాని, సర్వమున్
వమ్మొనరించు సన్న్యసనపద్ధతి నేర్పుదురా భవాదృశుల్!

కాలము చెల్లి, పశ్చిమముఖమ్మునఁ బ్రాయపుఁబ్రొద్దొకింతలో
వ్రాలఁగ నున్న పెద్దలు, భవత్ప్రతిపాదితధర్మమార్గచిం
తాలసితాత్ములై, తెలిసి, దారసుతాదుల నుజ్జగించిరన్
బోలు; నిదెట్టు లొప్పితివి ? మొగ్గను ద్రుంచుట, పిందె గోయుటల్.

'సత్త్రముతో నహింసవలె శాశ్వతికమ్మగు భర్తృయోగసం
పత్తికి భాజనంబవయి, వర్ధిలు మమ్మరొ' యంటి కాదె, యా
ర్యోత్తమ! మా వివాహపు ముహూర్తమునన్ బ్రణమిల్ల, నేల మా
పౌత్త్రెడసేయుటల్, భవదమోఘవచస్కృత కేల లోపముల్ ?

పిట్టలుగా మృగములుగాఁ
బుట్టుండని శాపమిచ్చి పోఁగూడదొ, మే
మట్టె జంటం బాయక
చెట్టుల గుట్టలను బట్టి జీవింతుముగా.

వలలోఁ జిక్కిన జక్కవ
పులుఁగుంబలె డిందువడి కువ్వాకువు మనుచున్
విలపించు నా మనోహరు
నెలుఁగుల్ చెవి సోఁకుచున్న విచటికి నాకున్.

పశుపక్ష్యాదుల కష్టపు
దశ చూడఁగలేని నీవు, తమ్ముని యేడ్పుల్
విశదముగా వినఁగల్గుట
వశిపుంగవ! నా యభాగ్యవశమునఁగాదే!

అని కడవెళ్ళని దుఃఖ
మ్మునఁ బొరలెడి దేవిఁ గాంచి ముదుసలి చెలి యో
ర్తనునయము నయముగల మె
త్తనిపలుకులఁ బెక్కుగతులఁ దాలిమి గఱపున్.

'పరమమృదువయ్యు, జీవితేశ్వరునికంటె
ధీరమానస మా చిన్నదేవి యనుచుఁ
జెప్పికొని మెచ్చుగా సంతసింతు మేము;
ఇంతమాత్రకె బేలవైతేమి తల్లి!

దినదిన మెంతమంది గురుదేవుని దర్శన మాచరింపఁగాఁ
జనరు? సపర్య సల్పి నిజసద్మము చేరరు? పెద్దకాలమై
కనినకతాన నీవిభుఁడు గౌతమదేవునితోడ నేమి మం
తనమున నున్నవాఁడొ, తనుదాఁ జనుదెంచెడి నింత నంతటన్.

కన్నుసన్నల మెలఁగెడి కాంతుగూర్చి
యీ యధీరవిచారము లింపు గావు;
విభుఁడు గ్రమ్మఱివచ్చెడి వేళయయ్యె
లెమ్ము, మాయమ్మ!' యని సాంత్వనమ్మొనర్చె.

అంతట భానుమంతుఁ డపరాంబుధి గ్రుంకఁగ, నత్తలోదరీ
స్వాంతమునందుఁబోలెఁ గలయన్ దెసలెల్లఁ దమంబు గ్రాఁకె, నా
కాంతను బుజ్జగించు చెలికత్తెలు విత్తెడు నాసపోల్కి నా
కింత వెలుంగు దోఁప నుదయించెను దారక లక్కడక్కడన్.

ఇది

చతుర్థ సర్గము

# అనుతాపము

స్మరదుర్మదుఁ బట్టి సపరివారంబుగాఁ
బశువరించిన యజ్ఞవాటివోలె
నూర్మిసంక్షోభమహోపద్రవము లేక
నిశ్చలంబగు శాంతనీరధివలెఁ
బ్రావృట్పయోధరావరణమ్ము తొలఁగి ని
ర్మలమైన శారదాభ్రమ్మువోలెఁ
బ్రశమితరాజసారంభమై మఱి శుద్ధ
సత్త్వప్రకాశమౌ స్వాంతమువలె

శాంతపావనగంభీరసరళభావ
బంధురంబయి ధర్మదేవత స్వయమ్ము
కోరి కట్టించుకొన్నట్టి కొలువుకూట
మనఁగ నొప్పారు బౌద్ధవిహారభూమి.

తఱచగు చెట్లనీడ సికతాకృతవేదుల సావధానతన్
గిఱికొనియుండు శిష్యులకుఁ గేవలతాపరమార్థబోధముల్
గఱపెడి శాక్యమౌనిపయిఁ గమ్మఁదనమ్ముల క్రొవ్వులైన క్రొ
వ్విరులను జల్లుచుండుఁ బృథివీరుహముల్ సుకృతంబు పెంపునన్.

గురువరు నుపదేశమ్ములు
మఱవక చింతనముసల్పి, మాన్యములు తదా
చరితముల నాచరింతురు
బురములఁ దిరుగుదురు బుద్ధమునివరుశిష్యుల్.

క్షణవిజ్ఞాననిరూపణమ్ములు, నహింసాధర్మసారప్రసా
రణముల్, జాతివిభేదకాననకుఠారమ్ముల్, దయాసత్యపో
షణముల్, గౌతము భాషణమ్ము లవి శిష్యశ్రేణి తత్ప్రాంతప
ట్టణపల్లీజనసన్నివేశములఁ జాటంబోము రశ్రాంతమున్.

ఛాగమ్ము మెడకుఁ గసాయికత్తికి మధ్య
వెసఁ జొచ్చి వ్రేటు తప్పించువారు
మాలపల్లెల కేగి మంచిమాటలు చెప్పి
దేహశౌచమ్ము బోధించువారు
దూరతఃపరిహృతదుర్గంధకుష్ఠదే
హుల కుపచారముల్ సలుపువారు
ఆప్తవియోగసంతప్తుల కూఱట
చెప్పి విరక్తి శిక్షించువారు

నాఁడునాఁటికిఁ బదులు వందలుగఁ జేరు
జనములకు ధర్మదీక్ష లొసంగువారు
నొచుఁ దిరుగుచునుందు రత్యంతసత్య
ధర్మశీలురు దేవదూతలవిధాన.

వారువీరను భేదభావమ్ము లేక
దొరకునెడ భిక్షగొందు రాదరము నించి,
నెమ్మది శయించెదరు రాత్రి నెలవు చేరి
గురుని పాదాంతికమ్మున శిరము లుంచి.

చూపుమేరకె చిత్తవిక్షోభముల న
ణంచి యానందధామ మనంగనొప్పు
నా విహారమ్ము నందుని భావమునకు
నింతయనరాని విక్షోభహేతువయ్యె.

బోనునఁ బడ్డ భద్రగజపోతముపోలిక రోషదుఃఖితం
బైన మనంబుతోఁ, దరళితాశ్రువిమూఢవిలోకనమ్ముతో
నా నృపసూతి యేకతములైన ప్రదేశములందుఁ జేరి యెం
తేని కుమారిలున్ జలరుహేక్షణఁ బ్రేయసి నెంచి యిట్లనున్.

హా! నవనీతకోమలి! ప్రియా! జగదేకవిమోహనాంగి! నా
ప్రాణధనంబ! నా ప్రణయరాజ్యరమారమణీయవైభవం
బా! నినుఁ బాసి యొంటిమెయిఁ బ్రాణముతో నిట నున్నవాఁడ, నీ
దీనుని నిస్సహాయుని గతిన్ గనువారలు లేక నెచ్చెలీ!

'నీ నయనమ్ములాన, గురునిం గని మ్రొక్కెడి యింతలో ననా
శ్యానవిశేషకమ్ము భవదాననలక్ష్మి భజింపవత్తుఁగా
దా! నను నమ్ము'మంచు శపథమ్ములు పల్కిన, ధర్మవృత్తికిన్
హానియొనర్పలేక సరియంటివి, తత్ఫల మిట్టులయ్యెఁబో.

తడఁబడుగుండెతో నెదురుదారులు సూచుచు నిల్చి నిల్చి, యె
య్యెడకును జాడగానమిఁ జెలీ! నను దూఱితొ, దూఱుకొంటివో!
పడమటిగాడ్పుదెబ్బ తిని, వాడిన తీవవిధమ్మునన్ బడ
ల్పడి వసివాడి కుట్టిమముపైఁ బడి కన్నులు తేలవైచితో.

అకట! లభింపదాయెఁ గద! యా సమయమ్మునకైనఁ జేరి, నీ
ముకుళితలోచనమ్మయిన మోమున మోమిడి, స్విన్నబాహువ
ల్లిక మెడకుం బెనంచికొని, 'లెమ్ము చెలీ! క్షమియింపు' మంచు వేఁ
డికొనుచు వట్టివేళ్ళసురటిం గొని చల్లఁగ వీచు భాగ్యమున్.

వెలవెలఁబోవు నెచ్చెలిపిండు మోమునఁ
 గ్రమముగా సంతోషకళలు దేఱ
దారుణంబైనట్టి తన్మహూర్తము శుభో
 దర్కమై మంగళోత్సవము సేయఁ

గువకువ వాపోవు కోడమరాచిల్క తె
క్క విదిర్చి కెరలుచు గంతువేయ
అనుతాపవశమున నాభిముఖ్యము భజిం
పఁగలేక నా చూపు ప్రక్కకొదుఁగ

ముసురు విడిచిన నాఁటి క్రొంబ్రొద్దు పొడుపు
వేళఁ గెందమ్మివలె నరవిచ్చు నీదు
కన్నుఁగవ గాంచు భాగ్యమ్ము గల్గదాయె,
నెంతవానికి నంత యదృష్టరేఖ! |

ఈ దెసకు నీదుచూపులు
ఆ దెసకుఁ నాదుచూపు లల్లిక గాని యీ
రోదోంతరమునఁ గలియుట
యే దర్శనభాగ్య మంబు జేకుఱు! మనకుఁ.

అన్నయనుజ్ఞ లేక యడు గావలఁబెట్టఁగ శక్తి లేదు, త
త్సన్నిధి కేగి నా వగపుచండము దెల్పఁగ శక్తిలేదు, నా
ఖిన్నత చూచి పొమ్మనుచు గెంటునుబో, యిట్టివంటి రూపుతో
ని న్నలయింప నీ యెదుట నిల్చెడి శక్తియు లేదు ప్రేయసీ!

అళికులస్పృహణీయమైన నీ ధమ్మిల్ల
భరమునఁ గుసుమమంజరులు తుఱిమి
కెందామరలకు రక్తిమ దిద్దు నీ పాద
ముల రత్ననూపురములను గూర్చి
అరచందమామ సోయగ మేలు నీ ఫాల
మునఁ బచ్చికస్తూరి బొట్టు దిద్ది
బాగోగులను నీవె పరికించుకొమ్మని
మణిగణస్థగితదర్పణము దాల్చి

సరసకలహమ్ము వేళ నంజలిఘటించి
ధన్యమైనట్టి నందుహ_స్తద్వయమున
నొకటి బిచ్చపుఁబాత్ర మోయుటకుఁ దొడరెఁ
దుడుచుచున్నది బాష్పబిందువుల నొకటి.

ఈసు విడనాడి దయచూపుదేని దేవి!
పత్రలాంఛితమైన నీ వదనలక్ష్మి
మనమునఁ నిల్పి ధ్యానించుకొనుచు, ము_క్తి
గాంచఁ బ్రయతించెదఁ రతికాంతు దయను.

అనుచు సంతానవాహినియైన వగపు
వెల్లువకు సేతు వొండు గల్పించుకొనును,
అదియుఁ బాఁతున లోఁతులేనట్టి దగుట
విరిసి కూలినఁ, దానును వెల్లి మునుఁగు.

చిడిముడిపాటున నింకొ
క్కెడ కేగును, గాలు నిల్వ కింకను వేఱొ
క్కెడ కేగు, వెండి మున్పటి
యెడకే యేతెంచి మరల నిట్లని వగచుఁ.

కిసలయకోమలమ్మయిన కేలు గ్రహించినదాదిగా రసో
ల్లసనమనోహరంబును, గళానవతారమణీయముఁ, నితాం
తసుఖదమైన నీదు చరితమ్మున నొక్కొకభావ మిప్డు మా
నసమునఁ బాఱి నీ నెఱతనమ్మునకుం బ్రణమిల్లఁ జేసెడిఁ.

కన్నుల వ్రేలుచున్నదదె కామిని! మద్విరహజ్వరా_ర్తిచే
వన్నెదొఱంగి, వెల్లనయి, వాడి, విశీర్ణశిరోజభారమై
యున్న భవత్స్వరూప మయయో! కఠినాత్ముఁడ మిత్రఘాతినై
నన్నిటు చూడవచ్చితివి, నాపయి నేటికి నీకుఁ బ్రేముడుల్ ?

మునుపటి యట్లె యున్నది కపోలమునందు విశేషకంబదే!
మన ప్రణయప్రసంగముల మర్మములం దలపించు రేఖ, నా
పొనరిచినట్టి పాపమును మూదలకించెడి ధర్మముద్ర, యీ
తని మఱుమేనికై తనువుదాల్చిన కర్మవిపాకబీజముల్.

ఎన్నివిధాలనో హృదయ మిచ్చి భజించితి విట్టిక్రూరునిన్
నిన్నుఁ దలంచి చిత్తసరణిన్ విలపింతున, జాలి నింతునా?
ఇన్నివిధమ్ములన్ హృదయ మిచ్చినప్రేయసి వీటిఁబుచ్చితిన్
నన్ను గుఱించి పల్లటిలనా, పెనుసిగ్గున మ్రగ్గిపోదునా?

ఎన్నఁగరాని కూర్మి నిలువెల్ల నొకింతగ రాగపూర్ణమా
సొన్నపుఁ బానపాత్ర యగుచున్ గరయుగ్మమునందు నిల్చు నా
పెన్నిధి, నిష్టదైవమును వీఱఁడినై యిటు పాఱవైచి కొం
టి, న్నిరుపేదనై యలమటించెద దిక్కఱి రిత్తజోగినై.

వలపుల్ వడ్డికిఁ బాఱఁ గౌఁగిటఁ గదింపన్ బాత్రవై, నిండుచూ
పులకున్ వెన్నెలవై, శ్రవోయుగళి కింపుల్ నింపు గానమ్మవై,
యలరుందావివి యయ్యు నూర్పులకుఁ, బై నాత్మైకభోగ్యమ్మవై,
తలఁపుల్ దాఁటి, యభిన్నవై, తుది మదాత్మా! నాకు లేవైతివే.

ఇది

పంచమసర్గము

అలవ లమర్చి, తీవియలయల్లిక పందిరివెట్టి, యంబుజ
మ్ములు దోవ లెన్నొ నాటి, జలపూరము నింపియు, నల్పబుద్ధినై
యలుఁగులు పూడ్చివైచితిఁ గటా! గృహదీర్ఘిక; కంచ వ్రాలునో?
యలి విహరించునో? మునుకలాడఁగ వచ్చునో? దప్పి దీర్చునో?

# ఉ ప దే శ ము

అని యిటు బహుభంగుల వగ
పునఁ బడి దిన మొక్క యుగము పోలికఁ గడపన్
విని, కని యాతని చందము
మునిపుంగవుఁ డొక్కనాఁడు ప్రోల నిలువఁగన్.

తన బాలిశత్వమ్ముఁ గనెనేమొ, వినెనేమొ
గౌతముం డనెడి సిగ్గరితనమ్ము
తన పాటు చూడఁగా మనసొప్ప కప్పుడే
విడిచిపుచ్చు నఁటన్న వెఱ్ఱి యాస
తన చేతి యమృతపాత్రము బోరగిలఁ ద్రోసి
నతఁడెకా యన్న రవ్వంత యూసు
పూజ్యపాదుని దెసఁ బొడమిన తన చెట్ట
భావమ్మునకు నాత్మ పాపశంక

యొక్కటొక్కటిగాఁ బుట్టి, యొకటి నొకటి
పొలియఁగాఁజేసి, యంతలోఁ బొత్తుగూడి,
వెండి పొడసూపి, నందుని పేదమనసు
తాళఁజాలనియంత గగ్గోలుచేసె.

మోయఁగలేని భావభరమున్ వహియించుట నీరసించి కే
ల్దోయిలి బట్టెఁగాని, తటితో "భవతేనమ" యంచుఁ బల్కలేఁ
డాయెఁ గుమారుఁ డా గురుని, నయ్యనఘుండును జాలిపెంపునన్
డాయఁగవచ్చి, తాఁ గవుఁగిటన్ గదియించి, శిరమ్ము మూర్కొనెన్

వన్న దొఱంగి, క్రొంజిగురు వాడి, కృశించిన లేఁతతీవకున్
వెన్నెలజల్లు క్రొమ్మిసిమి పెట్టినరీతిఁ గుమారనందుఁ డా
యన్న కవుంగిటన్ నిలిచినంతనె కీడ్వడియున్న యంగముల్
క్రొన్నవకంబు సత్తువయుఁ గొన్నటులాయె, మనంబు రెక్కొనెన్.

అమ్ముని యాసీనుండై
తమ్ముని నుపవిష్టుఁ జేసి, తనువు నిమిరి, శాం
తమ్ముగఁ దత్కోమలభా
వమ్మున కనురూపమైన ఫణితి నిటు లనెన్.

అంబుధి కంబుజారి యుదయంబునుబోలె, భవచ్ఛుభప్రవే
శంబు విహారవాటికకుఁ జాల మహోత్సవ మానఁటంచు భా
వంబున నెంచి, తోడికొని వచ్చితి ని న్నిటకుం గుమార! దై
న్యంబున మున్గియున్న భవదాననముం గనలేరు భిక్షువుల్.

చూడఁగదన్న! భిక్షువులు శోభనశీలురు, ప్రాణిదుఃఖముల్
చూడఁగలేరు, భూతహితలోలమనస్కులు, సత్యదేవతా
పీడ సహింపలే, రతను పెంపు జయించిన శూరతాఖనుల్,
వాఁడి యెఱుంగనట్టి మృదుభావులు, ప్రేమరసైకజీవనుల్.

తనతోడిదే లోకమని నమ్మికొని వేఱె
గతిలేని యొకతల్లి సుతుఁ డితండు
స్వయము గోరి వరించి కయికొన్న యొకనవ్య
లావణ్యలహరివల్లభుఁ డితండు
అభిషేకపరిపూతుఁడై మొన్ననే సింహా
పీఠ మెక్కిన రాచబిడ్డ యితఁడు
పట్టినకత్తి దింపక సంగరాంగణ
విహారణం బొనరించు వీరుఁ డితఁడు

మమతలం ద్రెంచి, కాముని మాయ గెలిచి,
రాజ్యలోభమ్ముఁ ద్రోసి, క్రూరత నణంచి,
శాంతులై చేరి నిల్చి రంజలిఘటించి
ధర్మదేవత పాదపద్మముల చెంత.

విడుమర యాధివ్యాధుల,
కుడుకువ మోహాదికమున, కురుసత్యదయల్
విడిసిన చోటిది; జాలిన్
బడ దేమిటి కన్న? దైన్యభావము గదురన్.

భవనిదాఘసంతాపముల్ పరిహరించు
సత్యశాంతిదయాదినిర్ఝరులు పొడము
నీవిహారమహాహార్య మెక్కి, యిటులఁ
గంట నీర్వెట్టఁ దగదు నీవంటివాఁడు.

పాలన్ జూడుము! శోకమోహభయసంభ్రాంతమ్ము, నీరంధ్రసం
సారారణ్యమునన్ దెసల్ దెలియ కాశాబద్ధమై సారెకున్
గ్రూరత్వమ్మున నొండొరుల్ గసిమసంగన్ బ్రాణిలోకమ్ము, హిం
సారంభమ్ము వినా, సుఖం బెటుల లభ్యంబౌ నిటన్ దేహికిన్?

భరమౌ నాఁకటిపిల్లునన్ బులి నిజాపత్యమ్ము భక్షింప, నూ
నరులై యీనరు లెల్లవారు పరసంతానమ్ము భక్షింతు, రీ
పరహింసారతమౌ జగమ్ము ననుకంపాదృష్టి రక్షింప నెం
తురుగానీ, మనకేమి యన్నటులఁ బ్రొద్దుల్ పుత్తురా రాసుతుల్?

ప్రాసాదోపరితలముల
దాసీజనకల్ప్యమానతత్తద్భోగో
ల్లాసలసితాత్ము లెల్ల ద
యాసారవిదూరులో? మహాంధులొ? తనయా!

కానలఁ బచ్చికల్ దిని మృగమ్ములు గ్రుక్కెడు నీరు గ్రోలి ప్రా
ణానిలముల్ భరించుకొనవా, నరు లెంతటి జాల్ములోకదా!
జేనెడు పొట్టకై దురితసింధువునం బడి సృష్టియెల్ల దుః
ఖాన ముడుంగఁ జేసి నరకప్రతిమాన మొనర్తు రక్కటా!

ఆఁకలిబాధచేఁ జెమట లాఱని గాసికి నోర్చి, ప్రాణముల్
పోకడపెట్టువారి శ్రమముల్ రుధిరమ్ము గడించి యీయఁగాఁ
జేకుఱినట్టి యర్థము లిసీ యని రోయ కెటుల్ భుజింతు వ
న్నా! కృపమాలి, ఘోరకలుషాక్తతఁ దుచ్ఛములైన భోగముల్.

త్రేఁగయినట్టి వేదనల పెల్లున మున్నె కుసుళ్లుగూలి, య
య్యో! గడికాళ్లతో నొకటి నొక్కటి తాఁచుచుఁ గ్రుమ్ములాడు నీ
లేఁగలవంటి లోకుల మలీమసభావముఁ బాపి ప్రోతురా,
రాగిలి భోగముల్ గుడుతురా? నినువంటి నరేంద్రపుత్రకుల్.

సారథికృత్య మొక్కరుఁడు, సైంధవకృత్యము వేఱొకండు శాం
తారభటిన్ యథావిధి నుపాయముమై నెఱవేర్చి లోకయా
త్రారథమున్ మునీంద్రవిహితమ్మగు గమ్యము చేర్పుకోసమై
పాఱుని జన్మమున్, బుడమిపాలుని జన్మముఁ గల్గె నిమ్మహిన్.

బరువు మోయఁగఁజాలు నశ్వములు లేక
ప్రాప్యము నెఱింగి నడపు సారథియు లేక
దారి తప్పెను నేఁటికి నారథమ్ము;
ఎచటఁ బడి కూలిపోవునో యెఱుఁగరాదు.

స్వర్గఫలకాంక్ష రాజ్యవిస్తారకాంక్ష
జన్నము లటంచు సంగ్రామసరణు లంచు
జనులు కురియించు రక్తవర్షమ్ముకతనఁ
దడియుచున్నది భూదేవితనువు కుఱ్ఱ!

పొదుగు విడువని పిల్లపై బుద్ధిపాటి
యడలునర్క దల్లి మేఁక స్నానాంగణమున
రాల్చు కన్నీటిబొ ట్లంకురములుగాఁగ
మొలచుచున్నవి విషవృక్షములు కుమార!

ఆద్యులైనట్టి ఋషులు సత్యం బహింస
ధర్మదేవత రెండు నేత్రము లటంచుఁ
గఱపిపోయిరి లోకసంగ్రహము కొఱకు;
నంధురాలయి యాపె యల్లాడు నిపుడు.

ఊబిలోఁ గాళ్లు దిగఁబడి, యోరమెడను
మలఁచి, బయ లాలకించు గోమాతవోలెఁ
దల్లడిలుచున్న దీ విశ్వధాత్రి, రాచ
బిడ్డనికి నీకుఁ దగునె యుపేక్ష సేయ?

నా తమ్ముండు దయాపయోధి, శ్రితచింతారత్న, మాపన్నర
క్షాతాత్పర్యుఁడు, బౌద్ధధర్మలతికల్ సాఁకంగలాఁ డంచు నే
చేతఃప్రీతిగ నెంచికొందుఁగద, యిస్సీ! పుష్పబాణాగమా
ధ్యేతృప్రాథమికుండవై, తిరుగఁజన్నే నీ కిటుల్ సోదరా!

వకనకలాడు పొట్టకు నింత గంజియే
నొదవని నిరుపేద యుమ్మలికయు
వేఁకియెత్తిన మందు మాఁకు పథ్యము పాన
మరయువారలు లేని యనద మూల్గు
అస్త్రజర్జరితాంగులై రణక్షోణి ది
క్కఱి యేడ్చువారి యాహారవమ్ము
పతివియోగం బేకసుతవియోగము జత
యై పొక్కు నిర్భాగ్యురాలి కూయి

అంధపంగ్వాదులగు వికలాంగులెల్ల
నలువు గగ్గోలు నేకమై జగతి, శోక
భీకరమహాంబునిధియౌచు, విరతిలేక
యడలుచుండఁగఁ జెవిఁదూఱదా, కుమార!

ఆఁకలిసెకకుఁ గాయమున మాంసాదులు
హరియించిపోవ శల్యములు మిగిలి
పొలుసెత్తి, పాలి, కన్నులగుంట లేర్పడి,
బోర యెండఁగ, బొజ్జ బూరటిల్లఁ
బుడకకాళులతోడ నడయాడు చల్లనఁ
బెరటిలోనికి నేగి బిడ్డఁ డచట
మంటిపెళ్లలు దినుచుంట గన్గొనియును
వలదని వారింప వాకురాక

కుత్తుకన్ నల్లపూసయుఁ, గుండెలోన
వడ్లగింజయుఁ, గనుల బాష్పములు లేక
కడుపు చుమ్మలుచుట్టఁగా నడలుచున్న
తల్లులం గాంచవో నీవు తమ్ముఁగుఱ్ఱ?

అవియున్ గుండెలు రాతికైనఁ గనుమన్నా! విశ్వదైన్యమ్ము, చా
లవు నీర్వెట్టఁగ వేయికన్నులు, భుజాలక్షల్ వలెన్ బాపకూ
పవిపన్నాత్ముల నుద్ధరింప, వెతఁబాపన్, సేదఁబోకార్ప, మై
నివురన్, బాష్పజలమ్ముఁ బోఁదుడువఁ దండ్రీ! లెమ్ము సజ్జుండవై.

అని బుజ్జవమునఁ బలికిన
విని నందుఁడు, బెదరు సుంత విడిచినమది నా
నన మెత్తిచూచి, గౌతమ
ముని కేమో విన్నవింపఁబోయి మనమునన్.

'వెన్నెల తోడికోడలయి, వీణియపాటకు విందువియ్యమై
సన్నని తెమ్మెరల్ నవతుషారకణమ్ములు సాఁకు బిడ్డయౌ
క్రొన్ననవంటి నా వలపుఁగూడ గురుండు దోసం గొనర్చి, నన్
జెన్నఁటిగాఁ దలంచి నిరసించె, నిఁ కేమని మాఱుపల్కుదున్?'

అనుచుఁ జింతించి, యేతాదృశానురాగ
విభవసామ్రాజ్యలక్ష్మియౌ వెలఁదిమిన్న
తలఁపునం బాఱ, ననుతాపతప్తుఁడగుచు
నెనరు నిండిన హృదయమ్ము నిశ్వసింప.
'గురుదేవుఁ డక్కటా! మన
నిరుపమమగు రాగసురధునిన్ దెగనాడన్,
వెఱతు నెదురాడఁగా, సుం
దరి! యీ నా దోసఁగుఁగూడఁ దగు మన్నింపన్.

ఎఱుఁగుదుగాన నందు విమలేంగిత, మీ పదదాసు నేరముల్
గఱుణదలిర్ప సైఁచెదవుగావున వేఁడెదఁగాక, నిష్కృతుల్
దొరకునె నా యఘమ్ములకుఁ దొయ్యలి! నాదొకమాట, యింతకున్
బరులు గ్రహింతు రెట్టు? లతిమానుషముల్ మన కూర్మి పేరుముల్.'

అనుచుఁ జింతాపరంపరలందు మరల
మునుఁగు నందునివైఖరి పోల్చి గురుఁడు
'మనసు దాఁపఁగ నేల? యీ మౌనముద్ర
వదలి ననుఁ గాంచుమన్న! నీ వదన మెత్తి.

నీ నా సందున నేటికీ యరమరల్? నిక్కమ్ము దెల్పంగదో
యీ! నా పల్కు రుచింపదేమొ? మది కేమే నొవ్వు గల్పించెనే
మో? నీ మానస మెట్లొ? నా కెఱుఁగరాదో? యాప్తు లెవ్వారు, తం
డ్రీ! నాకన్నను నీ' కటం చనునయించెన్ బేర్మి దైవారఁగన్.

ఇది

షష్ఠసర్గము

దగదీఱ నీరమ్ముఁద్రావి యోలలనాడ
రారయ్య! యో బాటసారులార!
చల్లని యీ తరుచ్ఛాయల సేదదే
ఱఁగ విశ్రమింపరారయ్య! సుంత
ముగ్గిరాలిన ఫలమ్ముల నారగింపర
య్య! మాకు నాత్మీయు లైతి రింక
అడ్డమాకలులేక యాడుఁడు పాడుఁ డు
య్యేలలూఁగుఁడు సంశయింపవలదు

కేళిదీర్ఘిక కలువలు గూలఁద్రోసి
చూఱవదలితి నలుఁగులు పాఱవిడిచి,
అరమరలులేక కొంచక యనుభవింప
రమ్ము! రాయంచలార! భృంగమ్ములార!

# ధర్మసంవాదము

అల్లన నిల్చి రాకొమరుఁ డానతుఁడై, తొలుదొల్త సుంత తొ
ట్రిల్లియుఁ గొంకొకింత యధరీకృత మైనకొలంది మాటలన్
దొల్లిటి మాధురీమహిమ దోఁపఁగ నంజలిపట్టి, 'సైఁపఁగాఁ
జెల్లుఁ బ్రభూ! ననున్, జనవుచేఁ బొరపొచ్చెపు మాటలాడినన్.

ననుఁ గాముకమాత్రునిగా
మనమునఁ దలపోసియేమొ, మదనాగమతీ
ర్థునిగాఁగ నానతిచ్చుట?
వినవలతున్ గురుఁడు నాదు విన్నపము దయన్.

ఎలదేఁటి రెక్కతుద పైఁ
బొలసినఁ గసుగందు మల్లెమొగ్గకుఁ దులయై,
తొలిసంజ నూత్నరుచులన్
గలకలమనినవ్వ వలపుఁ గాదనఁదగునే?

పొచ్చెమెఱుఁగని భావముల్ పొందిపొసఁగి
వలపునెత్తావు లీనెడు భాగ్య మల్ప
మగునె గురుదేవ! – నీ చెప్పినట్లు–శోక
బహుళమైన యనిత్యప్రపంచమందు.

చింతల్ సేరని తా, వుదారగుణముల్ శిక్షించు నాచార్యక,
మ్మంతశ్శత్రుసమాజమున్ దొలఁచు దివ్యాస్త్రంబు, నద్వైతభా
వాంతేవాసి, కృపాలతల్ మొలచు పా, దానందనిష్యంది, స
ర్వాంతర్యామిగదా, మహాప్రణయభావావేశ మోగౌతమా!

భానుకోటిప్రభాభాసమానమై, స్వ
తంత్రమై నిల్చు నానందధామమునకు
సంతతవసంతసుఖదమై జరగుఁగాదె
తాపహరమాచుఁ బ్రేమఘంటాపథమ్ము.

ప్రియజనవిహీనమైన జీవితము మొరడు,
ప్రణయమాధురి గ్రోలిన బ్రతుకు దివస
మాత్రమేనియుఁ జాలుఁ, బ్రేమమ్ములేమి
కన్న నిప్పచ్చరము వేఱ కలదె దేవ!

స్వరచయమ్ము లొండొంటిని బెరసి రాగ
రసము లీనెడుపగిదిఁ, బరస్పరమ్ము
భావములు గూడి రాగమ్ము ప్రభవమందుఁ;
దీయతలఁపులు మొదలంటఁ ద్రెంచుటెట్లు?

ప్రహరి చరింపుచున్ దిగిచిపట్టెడు నొండొకటిన్ సతమ్ము నీ
గ్రహములు ప్రేమసూత్రముల, రాగవశంవదవృత్తి గాదె! దు
స్సహబహుళాధ్వయానముల శ్రాంతి యెఱుంగక కుడుల్ చరించు న
న్వహము వియోగభారవహమైన దయావహగీతికారుతిన్.

వివృతతరంగబాహుఁడయి, విశ్వము నాత్మపృథూపగూహన
ప్లవమునఁ దేల్పఁగాఁ దివురు వారిధినాయకుఁ డైక్యభావసం
భవదనుభూతిసౌఖ్యరసభావనఁ జేసికదా మహాత్మ! యీ
భవవిషపాత్రలోఁ బ్రణయభాక్కుల కందు మరందబిందువుల్.

అకలుషమైన ప్రేమ కిరవై, నురుఁగుల్ వెలివాఱుచున్న స్ఫా
టికమణిపాత్రలోపల నటించు నిజప్రతిబింబదర్శనో
త్సుకసుఖమున్ వినిశ్చలతఁ జూఱఁగొనంగల నేర్పరుల్ గదా!
సుకృతులు, వారి కీభవము సుందరమై శివమై కనంబడున్.

విరియన్ బూచెడు దేవ! ప్రేమసుమముల్ విశ్వమ్ము; నాకొక్క క్రొ
వ్విరి మారందఝరీపరాగసుషమావిర్భావమానోజ్ఞమై
దొరకెన్, నాయెద నద్ది రాగరసమాధుర్యమ్ములన్ నింప, ద
బ్బఱి కావుల్ మెయిఁ గప్పు మాత్ర ముకుళీభావమ్ము సంధిల్లునే?

వసివాళ్వాడ, దొకప్పుడుఁ
గసుగందదు, మేల్మిచాయ కగ్గదు, తావుల్
కొసరదు, మరందము చిలుకును
విసువక యెదఁ దాల్తు నట్టి ప్రేమసుమమ్మున్.

తెలియనివాఁడఁ గాను గురుదేవ! జగజ్జనజీవనమ్ము క
శ్మలతరుఁ దావలంబయి, రుజావికలంబు, జరాపరీతమై,
కలుషలతాలవాలమయి, కాడును బీడయి, శోచనీయమై,
గులగులలాడు పుర్వులకు గూఁడయి మృత్యుముఖమ్ముఁ జొచ్చుటల్.

బుడగలవంటి తుచ్ఛసుఖపూర్తికి లోభమునొంది, యామిషం
బెడలిన యెమ్ము గాంచి కలహించెడు కుక్కలగుంపువోలెఁ బా
ల్పడిరి జగజ్జనుల్ ప్రణయలాస్యకళోచితరంగమైన యీ
పుడమి సమస్తమున్ బ్రధనభూమి యొనర్పగ నష్టబుద్ధులై.

నాకీ లోకముతోఁ బనేమి, వినుమన్నా! పాలమున్నీటిలో
నేకాంతమ్మగుచోఁ బ్రవాళములచే నేపారు ద్వీపమ్ములో
నాకుల్ రాలని పూలు వాడని వసంతారామమధ్యమ్ములో
రాకాచంద్రసహస్రముల్ వెలుఁగు హర్మ్యాగ్రమ్మునం దొక్కటన్.

నాకుం బ్రాణము ప్రాణమైన చెలితో నానాసుఖమ్ముల్ లతా
నీకమ్మై పెనఁగొన్న డోలికలలో నిఃఖేదదివ్యామృత
స్వీకారమ్ము భజింపుచున్ సమయముల్ సీమల్ వెసన్ దాఁటి, యే
కాకారమ్మును నిత్యమై నెగడు నయ్యానంద మర్థించెదన్.

అని యుత్కంఠ దలిర్ప నందుఁడు స్వకీయప్రేమసిద్ధాంతముఁ
వినిపింపఁ, సుగతుండు తద్వదనముఁ వీక్షించి, మందస్మితం
బును బెఁజాలియు జాలువాఱ, 'హృదయంబుఁ విప్పి మేల్సేసి తో
తనయా! వన్నెలుదేఱు నీ ప్రణయతత్త్వం బెల్ల నాలించితిఁ.

అఖిలజంతుసామాన్యమౌ నాత్మసౌఖ్య
లోలతయె పెద్దగాఁ జవుల్వట్టఁ జెప్పి
తింతదూరమ్ము, కామమోహితుల కెల్ల
నెంత చక్కని యుపదేశ మిది కుమార!

హద్దుమీఱిన విషయవాంఛాళిఁ దవిలి
పరువులిడు మానసహయమ్ముపజ్జ నరుగు
భావనన్ బట్టలేక, స్వప్నములు గిలుకు
కవుల వ్రాఁతలు చదివితోకాక నీవు!

ఆ తరుశాఖలఁ ఫలచయమ్ములు మెక్కుచు, వింతవింతలౌ
చేఁతలుఁ బల్కు లొండొరుల చేతములఁ గరఁగింపఁ గామసం
ప్రీతి ఘటింపుచున్న విరుమేనులు నొక్కటిచేసి, చెప్పు మా
క్రోఁతులజంట సౌఖ్యమునకుఁ సుత! యేమని పేరుపెట్టెదో?

లేదు కుమార! తన్మిథునలీలకు మర్త్యమనోజకేళికిఁ
భేద, మలీకసౌఖ్యములు పెక్కులు భావనచేసి, భ్రాంతిలో
నీఁదుచుఁ బెద్దపేరు లిడి, యిద్దియె నిత్యము సత్య మందు; వు
న్మాదముగాక, ప్రేమ మగునా, పరువంపు నిగారపుంబసల్?

అందగాఁడవు, కౌమరుఁబ్రాయమున నున్న
రాచబిడ్డవు గావున రాగభోగ
ములు కొనల్ సాఁగి క్రొన్ననల్ పూచుఁగాని
పరువమిది నీకుమాత్రము తిరముఁటోయి?

విందున్ నీసతి సార్థకాఖ్యయనుచున్ వేనోళ్ల, నీ రూపమున్
గందున్ డెందము విందుగా, మధురవాక్యస్ఫూర్తి నీ నెయ్యపుం
జందం బెల్ల నుపన్యసించితివి, వత్సా! యింతకున్ వాసియా
సౌందర్యమ్మును, రక్తి యొండొకట విశ్వమ్మందు లేదందువో?

ఆ కపిచాన తత్కపికి నందపుఁ బెన్గని, నీలతాంగియున్
నీకు వరాలమూట, మఱి నిర్జరకాంతల నిత్యయౌవనా
స్తోకవిలాసవిభ్రమరుచుల్ చవిసూచినఁ, దక్కరూపముల్
చీఁకటితోడఁబుట్టువు లిసీ! యనిపించుఁగదోయి, కంటికిన్.

తనయా! తాదృశమైన యచ్చరల సౌందర్యమ్మునున్ నాశమై
చనుఁ, బ్రేమింతువు నశ్వరమ్మయిన యా చక్కందన మ్మీవు, ని
త్యనవీనమ్మును, నాత్మభోగ్యమును, సత్యంబైన సౌందర్యమున్
గనరాదే? విషయప్రపంచమునఁ గాంక్షల్ పండ వెవ్వారికిన్.

గ్రుచ్చి కవుంగిటన్ బొదివికోఁ బనిలేదు, వియోగబాధలన్
ముచ్చముడుంగఁబోవదు, కనుంగవకున్ మఱి వీనుదోయికిన్
మెచ్చుఘటింపఁ గోరదు, నిమిత్తము వేఁడ, దొకప్డు మాఱ ద
య్యచ్చపుఁబ్రేమ మేఁశ? విషయాదివికారము లేడఁ బుత్రకా?

ప్రేమము ప్రేమమం చురక పెద్దనుడుల్ వచియింతు వీవు, ని
ష్కామము నాదు ప్రేమమని చాటెదు, నిన్నొక పృచ్ఛ చేసెదన్;
గామవికార మించుకయుఁ గల్గదయేని కుమార! చెప్పు మా
ప్రేమకు నాటపట్టయిన ప్రేయసికై యిటు లేల పొక్కెదో?

ఆలి చేలచెఱంగె యఖిలవసుంధరా
వలయమ్ముగా నెంచి ప్రహరిదిరిగి
మగువ కటాక్షదామమె విశ్వసామ్రాజ్య
పట్టమ్ముగా ఫాలపట్టిఁ జేర్చి

చాన కేలుంగవ సత్యధర్మములుగా
భావించి నిజకరద్వయి ఘటించి
విరిబోఁడి నెమ్మోముసిరి మోక్షలక్ష్మిగా
హృదయమ్ము చూడ్కులం దిరవుకొల్పి

మోహితాత్ముఁడవైతివి, ముగుదతలఁపు
లుజ్జగింపుము తనయ! యీ ముజ్జగమ్ము
నాత్మసంసారముగ నెంచు నలఘుచరిత
కాస్పదుండౌట లెస్స నీయట్టివాఁడు.

హృదయతటములఁ బొరలిపాఱెడి త్వదీయ
ప్రణయసురధుని విష్టపత్రయము నొకట
జాలిమై ముంచియెత్తినఁ బోలుఁగాక
యంగనామాత్రసమభిషేకార్హ మగునె?

విరియంబూచెడుఁ బ్రేమపుష్పముల నీ విశ్వమ్ము నిక్కమ్మై; క్రొ
వ్విరి నీ వొక్కటి పుణ్కి తాలిచితి వుద్వృత్తానురాగమ్ముమై
నురమం, దయ్యది వాడి రాలునపు డయ్యో! కంటక మ్మొండు ని
ష్ఠురతన్ నాటును, దానిఁ బుచ్చఁగల వెజ్జన్ మున్నె యోజింపుమా!

ఇన్ని పూవులుండ నీ వొక్కపుష్పమ్ము
పుణుక నేల? యెడఁద ముల్లు నాటి
తాపమంద నేల? తనయ! మమత్వదో
షమ్మె శోకకారణమ్ము సుమ్ము.

కడుపుదీపియుఁ, బితృభక్తి, కాంతమీఁది
నెయ్యమును, నెచ్చెలులపట్లఁ దియ్యఁదనము
'నా' యనెడు విత్తునం బుట్టి నాశమొందు;
మమత లేనట్టి ప్రేమ నిత్యము, కుమార!

ఎవ్వనికి వాఁడు, 'తా'నను నిష్టదైవ
మునకు నాలయమును గట్టి పూజసల్పు;
గాలియు వెలుంగుఁ జొరని తదాలయమునఁ
జివుకు దేవుని చెఱ మాన్పఁజెల్లు నీకు.

"తా" నొక గడ్డకట్టుకొని తత్పరతన్ శిలలై నశించు నజ్ఞానుల కేడనోయి సుఖసంగతి! తాఁ, దనయాలు, నాత్మసంతానము, తోడఁబుట్టువులు, తల్లియుఁ దండ్రి, కులమ్ము, దేశమున్ మానవు, లెల్లప్రాణులు కుమార! సమస్తముఁ దాను గావలెన్.

కొడుకులు లేని వారలకుఁ గూరిమిబిడ్డవు, మాతృహీనులౌ బుడుతల కెల్లఁ దల్లివయి పోషణసేయుము, 'నా' యనంగ లేకడలెడు దీనులన్ మనుపు, మార్తుల కాదరువై భజింపు, మీ పుడమి దివమ్ము సల్పు మిదెపో, పరమార్థము బౌద్ధజాతికిన్.

నిన్ను గృహమ్ము వీడుమని నే వచియించుట కర్థ మిట్టిదో యన్న! మమత్వశూన్యమును, వ్యాజవిహీనమునైన ప్రేమ నేనెన్నఁడు కాదనన్; సుకృతి వీవు, రసార్ద్రము నీయెడంద యీతెన్నునఁ బోయి సర్వజగతిన్ భజియింపుము నీకు మేలగున్.

తీయతలఁపులు మొదలంటఁ ద్రెంపుమనుచు
హృదయసూనమ్ము త్రుంపుమం చే వచింపఁ,
బ్రేమశూన్యము గాదన్న! భిక్షుగణము
జీవకారుణ్యమే మాకు జీవగఱ్ఱ.'

ప్రేమకన్న సత్యము లేదు భిక్షుకులకు
పరమసత్యముకన్న సుందరము లేదు;
లభ్యమైతి సౌందర్యలాలసుఁడ వీవు,
రసమయములౌను మనవిహారమ్ము లింక.

అమ్మహితాత్ముఁ డిట్లు హృదయంగమమాగతి, మాధురీధురీ
ణమ్ముగ ధర్మసారవచనమ్ములు పెక్కు లుపన్యసింపఁగా,
నెమ్మన ముద్గృహీతమయి నిల్చెఁ దదర్థమునం దొకింత యా
తమ్మునికిన్; నిసర్గనిశితమ్ములు గౌతము ధర్మబోధనల్.

గురునిపాదాబ్జములఁ జూడ్కిఁ గుదురుకొల్పి
'దేవ! భిక్షుకవృత్తి వర్తిల్లునట్టి
స్త్రీజనముగూడ నార్హతదీక్ష గాంచి
బౌద్ధధర్మము పాలింపవచ్చునేమొ?

అనతియిందు; న న్వలచి, యాత్మ ననున్ నెఱనమ్మికొన్న యా
చానకుఁగూడ సంసరణసంతరణమ్మగు దారిఁ జూపి య
జ్ఞానమువాప కే నొకఁడ సమ్మతిమై నవధర్మమార్గమున్
బూనఁగ నేర్తునెట్టులు? ప్రభూ! సహధర్మిణి వీటిఁబుత్తునే?

తేఱి ప్రసన్నమై మనసు తెల్వివహించెను, శోకమోహముల్
దూరములై భవాంధువునఁ దూలిన జీవుల నుద్ధరింపఁగాఁ
గోరిక పుట్టెఁ, దొంటి వలకూర్మికి దవ్వుల నిల్చి వేఁడెదన్,
బూరుషులెల్ల నర్హులయి బోటులుమాత్ర మనర్హలౌదురే?'

కరములు మోడ్చి నందుఁ డిటు గద్గదికన్ దను వేఁడుచుండ, నా
గురుఁ డొకయింత కన్మొగిచి, కొండొక యోజన సల్పి యంతటన్
విరిసిన నేత్రపద్మములఁ బ్రేమమరందఝరుల్ స్రవింప, నా
దరమునఁ గేలు సాఁచి పినతమ్ముని కేలు తెమల్చి యిట్లనున్.

వీనిన్ బెంచినధాత్రి నార్హతిని గావింపన్ దలంపూని, యీ
యానందుండును మున్న నీవలెనె న న్నర్థించె వేభంగులన్
గానిం డే నిపు డేల కాదనవలెన్; గాంతానిమిత్తమ్ముగా
హానిం జెందకయుండుఁగాక మనధర్మాంకూరముల్ పుత్రకా!

అసదృశమ్మగు బ్రహ్మచర్యవ్రతమ్ముఁ
బాలనమ్మొనరించుచు బౌద్ధధర్మ
మున నధికారిణులు నుందు రేని, యట్టి
శీలవతులకు నార్హతసిద్ధియగుత.

ఇది

సప్తమ సర్గము

“అద్వైతం సుఖదుఃఖయో రనుగతం సర్వాస్వవస్థాసు య
ద్విశ్రామో హృదయస్య యత్రజరసాయస్మి న్నహార్యో రసః
కాలే నావరణాత్యయా త్పరిణతే యత్ప్రేమసారే స్థితం
భద్రం తస్య సుమానుషస్య కథమ ప్యేకంహి తత్ప్రార్థ్యతే”

## అనుజ్ఞ

బాల్యమాదిగ నేర్చి పతిమెప్పు లందిన
గానవిద్యాప్రసంగములు మఱచి
నందుఁ డేఁగిన దారియందె కన్నుంచి
వాపోవు రాచిల్కను బుజ్జగించి
తనకోసమై యనుదినము క్రొత్తఁగఁబూచు
నారామలతల నెయ్యమ్ము మాని
చెక్కుచెక్కను రాయఁ జిత్రించుకొన్నట్టి
ప్రణయచిత్రముల వస్త్రమునఁ గప్పి

ఛాయకగ్గిన చిత్రమ్ము, సౌరభమ్ము
గోలుపోయిన సుమమునై, గుర్తుపట్ట
రానివిధమున నంతిపురమ్మునందుఁ
గాల మొకరీతి సుందరి గడపుచుండె.

వన్నెగలట్టి యా నగరవాసిను లొక్కొక రేఁగుదెంచుచుఁ
మన్ననమైఁ బరామరికమాటలు పల్కుచు నూరడించుచోఁ
గన్నుల నీరునింపదు, ముఖమ్మున దైన్యము చేరనీయ, దే
మన్నఁ దటస్థభావపరమై బదులాడదు నిర్వికారమై.

'మనసు మరలించుకొనె' నంచు, 'మఱచె' నంచుఁ,
'గాలమే మాన్పు సర్వదుఃఖముల' నంచు,
'మానవతి' యంచు, 'వైరాగ్యమూనె' నంచు
నోటి కొకమాట వీట నాబోటిఁగూర్చి.

ఆదటఁ బ్రత్యహమ్ము శుద్ధోదనుండు
శాక్యమునినూత్నధర్మసంస్థాపనమ్ము
వివరముగఁ దెల్ప శ్రద్ధమై వినుచు, దాని
మననముం జేయు నొంటిపాటునఁ గృశాంగి.

భావించిచూచుఁ దన యం
తేవాసులతోడ శాక్యధీరుఁడు జగతీ
సేవామతిఁ బొనరించెడి
పావనసంచారముల నుపన్యాసములన్.

ధనకనకవస్తువాహన
వనితాతనయాప్తబంధువర్గము నెల్లన్
గొనకొని త్యజించి, గౌతమ
మునివరుమార్గమ్ముఁ బట్టు పుణ్యులఁ దలఁచున్.

గురువరు నాదేశంబులు
శిరసావహియించి చేయు శిష్యులలో నె
ల్లరకంటె ముందు హృదయే
శ్వరునిన్ భావించికొని సెబాసని మెచ్చున్.

చిత్రాంబరములు దాల్చెడి విలాసిని క్రొత్త
తెలుపులు నీరుకావులు ధరించు
నెఱికురుల్ ముడిచెడి నేరుపుల్ పూసరుల్
విడనాడి చెలి యేకవేణి దాల్చు
బుద్ధదేవుని ధర్మబోధనల్ కూరిమి
చెలులకు వివరించి చెప్పుచుండు
భిక్షుకుండైనట్టి ప్రియు సత్యరూపమ్ము
భావించి యంజలిపట్టుచుండు

దినదినమ్ము యశోధరాదేవినగరి
కరిగి యటఁ బ్రొద్దుపుచ్చు, నా యన్నదమ్ము
లిరువురిఁ దలంచి నిట్టూర్చు, నింటనున్న
తమ్ముఁ దలపోసి యుత్కంఠ నుమ్మలించు.

సరవిన్ రెండవజామునన్ "భవతి భిక్షాం దేహి" యన్ వాక్య ము
చ్చరితంబైనపు డాలతాంగి చకితస్వాంతంబునం బుట్టు ని
ర్భరముల్, బాష్పజలప్రవర్షణసమర్థంబుల్, భవిష్యత్ప్రథ
స్ఫురణంబుల్, కరుణాప్రమోదభరితంబుల్, భావసంఘాతముల్.

ఆదరమూర భిక్షుకుల కర్చలొనర్చి, విహారవృత్తముల్
సోదెగొనున్, 'సుధాకలశసుందరపాణులు వేల్పువెజ్జు లా
సోదరు లిందు నందు భవశోకమహామయముల్ హరించుచో
నీదెస రారుగావలయు నెన్నఁడు' నంచు వచించుఁ గొంకుచున్.

పరిచారిక లెల్లరు ని
ద్దురవోవఁగఁ, బ్రోదిచిల్కతో నొంటిగ నుం
దరనందుని ప్రియవృత్తాం
తరహశ్చింతనము సెప్పి తలఁపులు త్రవ్వున్.

'మూఁడులోకమ్ము లొక్కట ముంచియెత్తు
ప్రణయమందాకినిన్ గృహోపవనసరసి
నిలిపికొని యోలలాడఁగాఁ దలఁచుచెల్ల
వీటిఁడితనమ్ము గాదఁటే, వెఱ్ఱిచిలుక!

పారములేని తన్మధురభావసమర్పితపుష్పపీఠిపైఁ
దీరుపుకత్తెనై నిలిచి, 'దేహి' యనన్ వరమిచ్చు వేల్పునై,
కూరిమిదేవినై మెలపుకొన్న ననుం బడద్రోసి విశ్వసం
సారము రాజ్యమేలుకొనసాగెఁగదే తుదిఁ జిల్కనెచ్చెలీ!

కాంతుమది లోఁతు గనక మోఁకాలిబంటి
గాఁదలంచి యుప్పొంగితి, గౌతమర్షి
యంతరాంతరమున నిధు లరసి యెత్తి
శుభ్రమణు లెల్లరకు నెఱచూఱలిచ్చె.

కారుక్రమ్మిన నామనోగహ్వరమున
వెలుఁగు మంగళదీపిక విశ్వమెల్ల
నేఁడు వెలిఁగించెఁగదె, చెలీ! స్నేహపూర
నిర్వికలనిత్యశుభకాంతి పర్వికొనఁగ.

జగముపున్నము ఫలియించి స్వామి సేవ
లందుకొనుఁగాక, నేను కాదంటినఁటవె?
ఈ యభాగినికింగూడ నించుకంత
పాలొసఁగ కిట్లు వెలిపెట్టనేల? చిలుక!

కాంతుఁడే తెంచు మార్గము క్రొత్తకై సేసి
యడుగుఁదోయికిఁ జల్వమడుఁగు లొత్త
నాతఁ డొనర్చు లోకారాధనమునకు
నుదకమై పుష్పమై యుపచరింప
నార్తసేవాప్రశాంతుఁడగు దయారాశికి
సురటినై చెమ్మటల్ సుడుగఁజేయ
నతఁడు విహారకుడ్యములఁ జిత్రించు భా
వములకుఁ బ్రాణార్పణమునొనర్పఁ

దగనఁటే నేను, నెచ్చెలీ! తనకుఁగాని
భాగ్యమిది నాకుమాత్రము యోగ్యమఁటవె?
అడవులకు నేఁగి యిల్లు నా కడవిఁ జేసె,
నయ్యడవి దేవళమ్ముఁ జేయనఁటె నేను?'

అనుచున్ మంతనమాడుఁ జిల్కచెలితోఁ, 'నార్తావనమ్మే కదా
తనకున్ ధర్మము, ప్రాణిపీడనముపొంతం బోరుగా భిక్షుకుల్,
మనమందున్ దను నమ్మికొన్న నను నిమ్మాడ్కిన్ విసర్జింపరా
దని బోధింపఁగరాదె నీ వరిగి, చిల్కా!' యంచు దీనాస్యయై.

బుద్ధదేవుని శ్రీపాదమూలమునకు
నరిగి శరణమ్ము వేఁడఁగా నాససేయు,
నంత తెగుదారితనము మేలాయటంచు
నుడుగు నమ్మానవతి; యంత నొక్కనాఁడు.

"శరణము బుద్ధదైవము ప్రశస్తపథమ్మగు బౌద్ధధర్మమే
శరణ" మటంచు భిక్షుకుఁడు సౌధపురస్స్థలి నిల్వఁ గాంచి, సుం
దరి వడిఁ జేరవచ్చి "శరణ"మ్మనె, నంత నతండు పల్కె 'నో
పరమదయామతీ! గురునిపంపున నేఁడిట కేఁగుదెంచితిన్'

అనుడు, నాయింతి మోమింతయై 'భదంత!
యెంతసుదినమ్ము నేఁడు? నీ కేమి పనిచె?
గురుని కీమందభాగ్యపైఁ గరుణవచ్చెఁ
గావలయు నేఁటి! కిఁక ధన్యఁగానె యేను!'

అనవుడు భిక్షుకప్రవరుఁ డాయమతోడ వచించు, 'సోదరీ!
వినుము, గురుండు నీహృదయవేదన గన్గొని, బౌద్ధధర్మమున్
గొన మతియించు నీచరితకున్ మదిమెచ్చి, యనుగ్రహమ్ముపై
నిను నిజశిష్యగాఁ బరిగణించె, నిదే కొనుమమ్మ! దీక్షలన్.

భద్రమిడుఁగాత! బుద్ధదైవమ్ము నీకు
బౌద్ధధర్మము నిను శోకవార్ధిఁ గడవఁ
జేయుఁగావుత! నిన్ను రక్షించుఁగాత!
భిక్షుసంఘమ్ము, శరణమ్ము వేఁడుమమ్మ!

వలవు తెప్ప నెక్కి భవవారిరాశిలో
మునుఁగనున్న మిమ్ము మనుచుపొంటె
వేఱుసేసె గురుఁడు విశ్వదయాహార
తరళయుగముఁ జేయఁదలఁచితల్లి!

నీకయి పొక్కి, నిన్ దలఁచి నీరయిపోయెను, రాగవృంతమున్
జేకొని త్రుంపలేక కడుఁజేడ్పడె, భిక్షుకధర్మమూన క
ట్టాఁకలు పెట్టె నందసుతుఁ డానెన రేమని చెప్ప! నింతకున్
సాకిరు లెల్లభిక్షుకగణమ్ము, గురుండు, విహారభూమియున్.

సత్యసంకల్పుఁడు గురుండు, సాధుహృదయుఁ
డింతకున్ నందుఁ, డీవృత్త మెల్లగతులఁ
గాంచె శుభపరిణామమ్ము; కడమ కింక
నీమనస్వితవేఱ వర్ణింపవలెనె?

అమ్మ! విషయోపరాగమ్మునందుఁ బొనుఁగు
వడిన మీ ప్రేమకణమును భద్రమూర్తి
దేశికుఁడు వెలికిందీసి దివ్యదీప
కళిక గావించి, విశ్వమ్ము వెలుఁగఁజేసె.

బ్రహ్మచర్యవ్రతము సత్యవాఙ్నియమము
జీవకారుణ్యము వహించి, చింతదొఱఁగి
భర్తృసహధర్మము చరించు భాగ్యమునకు
యోగ్యవగుమమ్మ! గురుఁడు ని న్నోముఁగాత!'

అనవుడు, రాగరంజితములౌ నయనమ్ముల మోదబాష్పముల్
దొనదొన జాలువాఱఁ దటితో నతినిర్మలశాంతభావమున్
గని పులువాయి ముత్తియముకై వడి మోము వెలుంగఁ, గ్రొత్తచె
ల్వూన మెయిదోఁగఁ, గేలుఁగవ మోడిచి యచ్చెలి నిల్చె నమ్రయై.

ఇది
యష్టమసర్గము

# స హ ధ ర్మ చ ర్య ము

దినదినము నా దయామయి దీనజనులఁ
బిలువనంపించి యిలువేలుపులకుఁబోలె
భక్తిమై నర్చలొసఁగి, యాభరణరాజిఁ
బంచియిచ్చును బ్రీతిసంభావనముల.

విడుదులు గావించు వీధులఁ దిరుగు గో
శ్వానమ్ములకు గృహోద్యానమందు
నింటింట బిచ్చమ్మునెత్తు పంగ్వంధుల
రావించి తనమందిరమున నిల్పుఁ
బథ్యపానములంపు జ్వరితుల, కెచరించి
వెజ్జుల వ్రణితుల వెతలు మాన్పు
మృత్యువు సొచ్చిన గృహము లదృష్టదే
వతవోలెఁ జొచ్చి దుఃఖితుల నోము

నాఁడునాఁటికి గేహ మనాథబాల
కులకు విద్యాలయమ్ము, రుగ్ణులకు వైద్య
శాలయై, ధర్మదేవత కాలయమ్ము
నగుడుఁ, దా నందుఁ బూజరియయ్యె నబల.

'హా' యనెడు పిల్పు వీతేర, 'నో' యటంచు
నుట్టిపడు స్థూలదేహమ్ము నుజ్జగించి
యా తపస్విని శబ్దమాత్రానుమేయ
తనుతరాకృతి దాల్చు భూతదయవోలె.

తళతళమను తొంటితనువు కృశించి
ప్రసన్నశాంతద్యుతి సంపతిల్ల
సౌయ్యార మెడలిన యొసపరినడక
శార్తత్రాణపరత సంభ్రమముఁ గఱప
వతనుసంజీవనమైన బెళ్కుంజూపు
నిర్వికారత నిండునెనరుఁ జింద
దరిలేని హృదయసౌందర్యసేకమున
విశ్వమెల్ల రసమయత్వమ్ముఁ దాల్ప

సస్మితాననకాంతి వత్సలతఁ గురియ
సన్నకావి ధరించి యా సౌమ్యభావ
చొచ్చు దుఃఖాంధతమసమ్ము చొచ్చినట్టి
యెడలు పరికించి క్రొంబ్రొద్దుపొడుపువోలె.

ఒకనాఁటి సందెచీఁకటి
మొకమున నాయమ గృహాభిముఖయై చనుచో
వెకివెక్కియేడ్చుచున్ బా
లకుఁ డొక్కరుఁ డడ్డమై నిలంబడి త్రోవన్.

తనుఁ గాంచినంతనే గ్ర
క్కునఁ జేరఁగవచ్చి, కావికొంగు కరమునన్
గొని లాగుచు, వెన్కకు ర
మ్మనుచున్ జేసాఁపి చూప నాయమ కరుణన్.

ఒకకేలఁ గనులు నులుముచు
నొకకేలన్ దన్ను లాగుచుండిన యా బా
లకు చుంచు దువ్వి 'శోకిం
పకుమన్నా! యేను వెంటవచ్చెద' ననుచున్.

దీపికోజ్జ్వలవిపణివీథిం దరించి,
ధనికులు వసించు వాడలు దాఁటి, యంతఁ
గాఱుచీఁకట్లఁ దేలు కుటీరపాళి
లోన దుర్గంధిలపుసందులోనఁ జనుచు,

చితచితలాడు నీరమునఁ, జేఁపలకంపునఁ, బందిముట్టియల్
కతికెడి చప్పరింపులను, గ్రైకుయిలాడెడు కుక్కకూఁతలన్
బ్రతిరనదించు దర్దురరవమ్ముల, నీఁదరబ్రామోఁతలన్ దరి
ద్రత తలపేలు గ్రుక్కికొను తావులలో వెలివాడ చక్కటిన్

ఒకగుడిసెలోనికిన్ బా
లకు వెంటం జొచ్చి, తైలలవపుష్టమ్మా
మకమకని దివ్వె వెలుఁగున
నొకట సమాసన్నమరణ నువిదన్ గాంచెన్ .

కావులు గట్టియున్ దరుణకంజహితుం బురుడించువాని, దుః
ఖావిల నొక్క బాలను దయామతి నక్కునఁ జేర్చి ముంగురుల్
ప్రోవిడి ముద్దుగొం చవలిమోమయి నిల్చినవాని, భిక్షు న
ప్పావని కాంచి "బుద్ధభగవానుఁ డగున్ శరణమ్ము మా" కనెన్.

ఆపలు కాలకించి యతఁ డాయమఁ గన్గొనెఁ, గాంచె వానిమో
మాపె, పురఃప్రసారితములైన కరమ్ముల, నారవిచ్చునా
సాపుటనేత్రయుగ్మములఁ జయ్యన నొండొరు డాయఁబోవువా
రై, పదయుగ్మ మెత్తియును 'హా' యని నిల్చి నిరుద్ధచిత్తులై.

'ప్రాణమా' యంచు నొండొరుఁ బల్కరింప
సాఁగి, 'ప్రా'మాత్రపర్యవసన్నములగు
వెలుఁగులు గళమ్ముఁదగులఁ, దా మెట్టకేని
యనిరి 'గచ్ఛామి బుద్ధం శరణ' మటంచు.

అనిలవశమ్మునన్ క్షుభితమయ్యెను వెండియు నంతలోన శాం
తినిగాని కల్తదేఱి ప్రకృతిస్థములైన కొలంకులట్లు నె
మ్మనములు దేఱఁ, జూపులను మాఁటిన మబ్బుతెరల్ తమంత నం
తన తెరలన్ నిలంబడిరి నందుఁడు సుందరియున్ బ్రసన్నులై.

పిదప మంచములోని యా పేదరాలిఁ
గాంచి చెటియొకదెస నిల్వఁ, గాలమహిమ
ఘంటికానాదములు వీనుఁగవ నదింప
నాపె కనువిచ్చి నలుదెస లరసికొనుచు.

చెంత నిల్చియున్న చిన్ని నిసుంగులఁ
జేరఁదీసి, నందు చేతియందుఁ
గూఁతుహస్త మిడియెఁ, గొమరునిహస్తమ్ము
సుందరీకరమ్మునందు నిడియె.

పిమ్మట వారిహస్తములు, బిడ్డలపాణియుగమ్ము లాత్మహ
స్తమ్ముల నూఁది, కన్గొనల జాఱు ముదశ్రులతోడ దీర్ఘదీ
ర్ఘమ్ముగ నిశ్వసించుచు సుఖమ్ముమెయిన్ గనుమోడ్చె, నంతలో
సమ్ముఖమందు నిల్చె భవసాగరపోతము గౌతమర్షియున్.

'శరణము బుద్ధదైవ' మని సాఁగిలి మ్రొక్కిన నందసుందరీ
శిరముల దీవనల్ కురిసి, చెంతను నిల్చిన బిడ్డలిద్దఱన్
జెటియొక చంక కెత్తికొని, చిర్నగ వాననసీమఁదోఁప, నా
దరమునఁ బల్కె నగ్గురుఁడు తచ్చరితమ్మున కెంతొ మెచ్చుచున్.

'తెక్కలించితి మున్ను నేనొక్కనందు
సుందరీ! ధర్మసోదరీ! చూడు మిదిగో!
ధర్మసోదరు నొకనందు, ధర్మతనయు
నొక్కరుని బాలనందు నీ కొసఁగుచుంటి.

సుందరి బాహుబంధమునఁ జొక్కి నినున్ గొనిపోయినాఁడ నో
నందకుమార! నాఁ, డిదిగో! నా ఋణమీఁగితి ధర్మసోదరిన్
సుందరి, నీ యనాథశిశుసుందరి నేఁ డిడుచుంటి నీకు, నా
నందము సుందరమ్మయి కనంబడుఁగావుత సృష్టి మీకికన్.

మిత్తి మొగమ్ము సొచ్చియును మీకయి వెన్కకు నేగుదెంచి యీ
యుత్తమురాలొసంగెఁ దనయున్ దనయన్ మఱి కైకొనుండిదే!
మిత్తిప్రసాద మీమిసిమిమీఁగడలన్, దొలినాఁటి కూర్మి రే
కెత్తి యనాథవత్సలత కిమ్మయి చూలయి పండుఁగావుతన్.

ఎందఱో నందులున్ మఱియు నెందఱో సుందరు లిట్టిదీనులా
కందుల, మంటిపుట్టువులఁ గాచి, యఖండము నవ్యయమ్ము నా
నందముఁ గొంద్రుగాత'మని నందుని సుందరి కిచ్చె, సుందరిన్
నందున కిచ్చె, దివ్యకరుణామయుఁ డగ్గురుదేవుఁ డాదృతిన్.

సుందరీనందు లాబాలనందసుంద
రీకరాబ్జాతముల నూఁది, ప్రేకనై తో
లంకు నానందవశత గళమ్ము లెత్తి
జయముపాడిరి దేశికస్వామి కిట్లు.

బుద్ధాయ మహితప్రబోధాయ వైరాగ్య
భవనాయ దేవ! తుభ్యం జయోస్తు
కలికల్మషహరాయ కారుణ్యలతికాల
వాలాయ దేవ! తుభ్యం జయోస్తు
నిర్జితహింసాయ నిర్మితధర్మప్ర
పంచాయ దేవ! తుభ్యం జయోస్తు
త్యాగస్వరూపాయ దశదిశాగతశిష్య
భజనాయ దేవ! తుభ్యం జయోస్తు

ఆర్తసంరక్షకాయ తుభ్యం నమోస్తు
పరమసత్యవ్రతాయ తుభ్యం నమోస్తు
దీనజనబంధుమిత్రాయ తే నమోస్తు
విశ్వకళ్యాణకరగురవే నమోస్తు.

ఇది
నవమసర్గము

బంధువు లేకమానసులు బాల్యసఖుల్ సహపాఠులున్ సమ
స్కంధులు, పింగళాన్వయుఁడు కాంతుఁడు, కాటురి వేంకటేశుఁడున్
సుందరనందరాగరసశోభితవృత్తము, రమ్యతత్త్వ మీ
సౌందరనందసత్కృతినిసల్పిరి దేశికుఁ డిచ్చ మెచ్చఁగన్.

భావమొక్కఁడుగాగ భావనయొక్కఁడై
రసభావపరిణతి యెసఁగఁజేసి
సరసార్థమొకఁడుగా శబ్దమింకొకఁడయి
శబ్దార్థసామరస్యము ఘటించి
సూత్రమొక్కఁడుగాక చిత్రణమొక్కఁడై
ప్రాణవత్పాత్రముల్ పాదుకొల్పి
తెరయెత్తుటొకఁడుగా తెరదించుటొక్కఁడై
రంగనిర్వహణమ్ము రక్తిసల్పి
సుందరీనంద జీవితానంద మట్లు
పరమమగు కోటికెక్కిన బంధుభావ
మిత్రభావము లిమ్మొయి మేళగించి
సృష్టిజేసితి మీ కావ్య శిల్పమూర్తి.

సౌందరనందము
సర్వమును
సంపూర్ణము.

# కృతిస్వీకారము

శ్రీకళ్యాణ పరంపరల్ పరఁగుతన్, సిద్ధించుతన్ గోర్కు, ల
స్తోకం బాయు వెసంగుతన్, రుచిరమై లోకంబు వర్ధిల్లుతన్
నీకు న్నీకును, మీకు నిర్వురకు సుస్నేహమ్ముతోపాటు ల
క్ష్మీకాంతాహ్వయ ? వేంకటేశ్వరకవీ ? చెల్వారుతన్ సంపదల్

ఎవ రేమిచ్చిన స్వీకరించుకొనుటకే యీపీఠ మే నెక్కి, యు
త్సవసందర్భసమాగతుల్ సలుపు సత్కారమ్ముతోపాటు మీ
కవనమ్మున్ గృతిఁగొంటి సంతసముమైఁ, గళ్యాణసంపత్తి మీ
కవినాభావముగా ఘటించుటకునై యాశీస్సు లర్పించుచున్.

చంపకమిచ్చి, యుత్పలమొసంగి, మదేభముఁ దెచ్చి నేఁడిటన్
సంపదఁబట్టి నాకిడిరి సత్కృతులెందఱొ యింతమాత్రఁ జా
లింపక యింకఁ గొన్నిటి లలిన్ గలయంగ లగించి మీరు మ
న్నింపఁగఁడంగు లెవ్వరికి నేని ముదం బుదయింపఁ జేసెడిన్.

కవితావాసన పూర్వజన్మకృతమే "కస్తత్రసందేహః" యం
చు విశేషజ్ఞులు వల్కుచుండినను, మీ చూపిందుకున్ వేఱుగా
నవమార్గమ్మునఁ బెట్టి, మీ కవితకు న్నన్ గారకున్ జేసి, మీ
కవితాకన్యకఁ గానుకన్ బెట్టితిరి సత్కారమ్ము తోరమ్ముగన్.

బ్రదుకుఁడు చిరకాలము సం
పదపొంపిరివోవఁ, గనుఁడపత్యమ్మును ని
ర్గదమైనదాని, నిఁక మీ
యెద యెందు లగించు దాని నెయిదుఁ డిరువురున్.

‘కృతికిన్ మీగురు వేమొసంగె’ నని మిమ్మేరేని ప్రశ్నింప, ‘స
త్కృతి మాకిట్టులొనర్చె మాగురు’ వటం చీపద్యముల్ చూపుఁ, డ
ప్రతిమప్రజ్ఞులు సత్కవీశ్వరులు, ‘విద్వాంస్తుష్ట’ యన్ వాక్యమున్
స్మృతికెక్కించుక మిమ్ము మెత్తురు కదన్ మీపూన్కి కగ్గించుచున్

‘అర్థిని కవయతి కవయతి’
వ్యర్థంబెటులగు నటంచుఁ బలికియు, మది భూ
తార్థ మ్మెఱుంగుకతనఁ ‘గృ
తార్థులు మీ’రనుచు మిమ్ము నగ్గింత్రు కవుల్.

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి.
శతావధాని.

ఇది
యాశీర్వచనము